ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
నల్లగొండ
5
సోమవారం 12 మే 2025

హెల్ప్‌లైన్ నంబర్లు
దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980
నల్లగొండ : 18004251442
యాదాద్రి : 1800 425 7106
సూర్యాపేట : 1800 425 1972


చికెన్ ధరలు
గుడ్డు డజన్ ధర : 66

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.170	260	290
సూర్యాపేట	రూ.174	260	290
నల్లగొండ	రూ.165	245	270

ఉష్ణోగ్రత గరిష్ఠం 39.0 । కనిష్ఠం 24.2

పర్యాటక కేంద్రంగా మారేనా?

» ఫణిగిరి బౌద్ధక్షేత్రంలో చూడదగినవెన్నో.. » నేడు బుద్ధ పూర్ణిమ


ఫణిగిరి బౌద్ధక్షేత్రం

సూర్యాపేట జిల్లా నాగారం మండలం ఫణిగిరి బౌద్ధక్షేత్రాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చి దిద్దుతామని ఎన్నికలప్పుడు రాజకీయ నాయకులు ఇస్తున్న హామీలు గాలిలో కలిసిపోయాయి. ఫలితంగా ఫణిగిరి బౌద్ధక్షేత్రం పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉంది. నేడు బుద్ధ పూర్ణిమ సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' అందిస్తున్న ప్రత్యేక కథనం...

- (ఆంధ్రజ్యోతి-మోత్కూరు)

నాగారం మండల కేంద్రంలోని ఫణిగిరి కొండపై సుమారు 16 ఎకరాల విస్తీర్ణంలో ఈ బౌద్ధక్షేత్రం విస్తరించి ఉంది. ఫణిగిరి అంటే పాము పడగ కొండ అనుకుంటారు గాని ఫణి అంటే జ్ఞానమని, జ్ఞానం కలిగిన కొండ బౌద్ధులు చెబుతారు. ప్రపంచంలో ప్రసిద్ధిగాంచిన బౌద్ధక్షేత్రాల్లో...

- మిగతా 7వ పేజీలో...

పర్యాటక క్షేత్రానికి ప్రపంచ సుందరీమణులు

» నేడు బుద్ధవనంలో 2,569వ బుద్ధ జయంతి ఉత్సవాలు
» హాజరుకానున్న మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు


విద్యుద్దీపాల వెలుగులో బుద్ధవనం

ప్రపంచ పర్యాటక క్షేత్రానికి ప్రపంచ సుందరీమణులు రానున్నారు. వారి పర్యటన కోసం సాగర్‌లో పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న మిస్‌వరల్డ్ పోటీల్లో పాల్గొనేందుకు ప్రపంచ దేశాలనుంచి వచ్చిన ముద్దుగుమ్మలు సోమవారం సాగర్‌లో పర్యటించనున్నారు. బుద్ధవనంలో నేడు జరిగే బుద్ధ జయంతి వేడుకల్లో వారు పాల్గొంటారు. వారితోపాటు జిల్లాలోని మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు హాజరవుతారు. నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్‌చంద్రపవార్, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్‌లు ఏర్పాట్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.

- (ఆంధ్రజ్యోతి-నాగార్జునసాగర్)

అంతర్జాతీయ బౌద్ధ క్షేత్రం.. ప్రపంచ పర్యాటక కేంద్రమైన నాగార్జునసాగర్‌లోని బుద్ధవనంలో సోమవారం 2,569వ బుద్ధజయంతి(బుద్ధపూర్ణిమ) ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నారు. ఈసారి బుద్ధ జయంతి ఉత్సవాలు ప్రత్యేకంగా జరపనున్నారు. రాష్ట్ర పర్యాటక శాఖ ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ప్రపంచ సుందరీమణుల పోటీదారులతోపాటు జిల్లా మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉమ్మడి జిల్లాకు చెందిన 10 మంది ఎమ్మెల్యేలు, ఇద్దరు ఎమ్మెల్సీలు హాజరవుతున్నారు. ఈ కార్యక్రమం సాయంత్రం 5గంటలకు ప్రారంభమై 7:45 గంటలకు ముగియనున్నట్లు అధికారులు తెలిపారు. మిస్ వరల్డ్ పోటీల్లో పాల్గొనే ఆసియా దేశాలకు చెందిన 30 మంది పోటీదారులు బుద్ధజయంతి ఉత్సవాల్లో పాల్గొనున్నరు. కార్యక్రమానికి ఎస్పీ శరత్‌చంద్ర పవార్ ఆధ్వర్యంలో పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. బందోబస్తులో 2000 మంది పోలీస్ సిబ్బంది పాల్గొననున్నట్లు ...

- మిగతా 7వ పేజీలో...

భూముల రికార్డులు ఇక పదిలం


భూములను

ప్రభుత్వం రెవెన్యూ శాఖలో సంస్కరణలను తీసుకొచ్చింది. గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన ధరణిలో లోపాలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ధరణితో రైతులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్న దృష్ట్యా, భూముల క్రయవిక్రయాలు, రికార్డులు పారదర్శకంగా ఉండేందుకు ప్రభుత్వం తగిన చర్యలు చేపడుతోంది.

- (ఆంధ్రజ్యోతి-యాదాద్రి)

» భూ రికార్డుల ప్రక్షాళనే లక్ష్యంగా ముందుకు
» 'భూభారతి'తో సమస్యల పరిష్కారంపై దృష్టి
» పైలట్ మండలాల్లో జోరుగా దరఖాస్తుల స్వీకరణ
» 30వరకు పరిశీలన

గ్రామాల్లో భూ సమస్యల ప్రక్షాళనకు ప్రభుత్వం రంగం సిద్ధం చేస్తోంది. ఇందులో భాగంగా గ్రామానికో రెవెన్యూ అధికారిని నియమించనుంది. భూ సమస్యలపై క్షేత్రస్థాయిలో పరిశీలించి.., ఎప్పటికప్పుడు పరిష్కరించే దిశగా 'భూభారతి'లో ఈ నిబంధన తీసుకొచ్చింది. ప్రభుత్వం మొదటగా నాలుగు జిల్లాల్లోని ఒక్కో మండలంలో పైలట్ ప్రాజెక్టుగా చేపట్టింది. అనంతరం అన్ని మండలాల్లోనూ 'భూభారతి'పై విస్తృత ప్రచారాన్ని చేపట్టింది. జిల్లాలో మొత్తం 17 మండలాల్లో ఏప్రిల్ 21 నుంచి 30వ తేదీవరకు రోజువారీగా అవగాహన సదస్సులు నిర్వహించింది. అయితే ప్రభుత్వం ఇటీవల అన్ని జిల్లాల్లోనూ ఒక మండలాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసింది. ఇందులో భాగంగా యాదాద్రి భువనగిరి జిల్లాలోని ఆత్మకూరు(ఎం) మండలాన్ని పైలెట్ మండలంగా ఎంపిక చేసింది. సూర్యాపేట జిల్లాలోని గరిడేపల్లి మండలాన్ని, నల్లగొండ జిల్లాలోని నకిరేకల్ మండలాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసింది. ప్రస్తుతం జిల్లా రెవెన్యూ యంత్రాంగం ఆత్మకూరు(ఎం) మండలంలో గ్రామగ్రామాన 'భూభారతి'పై అవగాహన కల్పిస్తూ, భూసమస్యలపై రైతులు, ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్నారు. అయితే పలు గ్రామాల్లో ఏళ్ల తరబడి పరిష్కారం కాని భూ సమస్యలపై అధికారులకు దరఖాస్తు చేసుకుంటున్నారు. రెవెన్యూ అధికారులు ప్రజల నుంచి ప్రతీ దరఖాస్తును స్వీకరిస్తున్నారు. ఈ సమస్యలను ఎలా పరిష్కరించాలన్న అంశంపై ప్రజలకు వివరించనున్నారు. పైలెట్ మండలాల్లోని గ్రామాల్లో ఈ నెల 15వ తేదీ వరకు గ్రామసభలు, సమావేశాలు పూర్తిచేసి, ఫిర్యాదులను స్వీకరించనున్నారు.

జూన్ నుంచి అన్ని మండలాల్లోనూ..

ప్రభుత్వం జూన్ నెల నుంచి అన్ని మండలాల్లోనూ భూభారతి చట్టం అమలుపై నిర్ణయం తీసుకోనుంది. పైలెట్ మండలాల్లో రెవెన్యూ సమస్యలు పరిష్కారమవుతోన్న నేపథ్యంలో అన్ని రెవెన్యూ గ్రామాల్లోనూ ప్రజల నుంచి భూ సమస్యలపై దరఖాస్తులు స్వీకరించనున్నారు. ఈ మేరకు మండలాలవారీగా గ్రామసభలపై త్వరలోనే షెడ్యూల్ రూపొందించేందుకు జిల్లాయంత్రాంగం సన్నద్ధమవుతోంది. ఈ సమావేశాలను జిల్లాలోని 17మండలాల్లోని 382 రెవెన్యూ గ్రామాల్లో జిల్లా కలెక్టర్ సారథ్యంలో అదనపు కలెక్టర్ల పర్యవేక్షణలో నిర్వహిస్తారు. ఆర్డీవోలు నోడల్ అధికారులుగా నియమించే అవకాశం ఉంది. భూభారతి ప్రధాన లక్ష్యం గ్రామస్థాయిలో భూములకు సంబంధించిన రికార్డులను పదిలం చేయడం. గత ప్రభుత్వం గ్రామస్థాయిలో రికార్డులను తొలగించింది. 2014కు ముందు గ్రామాల్లో రెవెన్యూ శాఖ ఏటా జమాబందీ నిర్వహించేది. రెవెన్యూ, వ్యవసాయ, నీటి పారుదల శాఖల సిబ్బంది ఏడాదికోసారి రికార్డులను పరిశీలించేవారు. వ్యవసాయ, వ్యవసాయేతర భూముల వివరాలు, చోటుచేసుకున్న మార్పులు, ప్రభుత్వ భూముల వివరాలు, కబ్జాలు, తదితర అంశాలను ఎప్పటికప్పుడు రికార్డుల్లో నమోదు చేసి రెవెన్యూ శాఖకు పంపేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. దీన్ని గుర్తించిన ప్రభుత్వం పూర్తిస్థాయిలో రెవెన్యూ రికార్డులను ప్రక్షాళన చేసేందుకు చర్యలు చేపట్టింది.

గ్రామాల్లో వచ్చిన ఫిర్యాదులను పరిశీలించేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నారు.

15నుంచి 30వరకు దరఖాస్తుల పరిశీలన

పైలెట్ మండలాల్లో ఈ నెల 15 నుంచి 30 వరకు భూసమస్యలపై వచ్చిన దరఖాస్తులపై పరిశీలన చేపట్టనున్నారు. జిల్లాలోని ఆత్మకూరు(ఎం)లో భూసమస్యలపై అన్ని గ్రామాల్లోనూ దరఖాస్తులు అందుతున్నాయి. ప్రధానంగా ధరణి కారణంగా భూముల రికార్డుల్లో విస్తీర్ణంతోపాటు పేర్లు, సర్వే నెంబర్ల మార్పులు, కోర్టు కేసులు వంటివి అందుతున్నాయి. రెవెన్యూ యంత్రాంగం ఈ నెల 15వరకు గ్రామాల్లో వచ్చిన దరఖాస్తులను పరిశీలించనున్నారు. ఈ నెల 15నుంచి 30వరకు జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్‌తోపాటు ఆర్డీవోలు, తహసీల్దార్, రెవెన్యూ సిబ్బంది దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి వారికి భూసమస్యకు సంబంధించిన వివరాలను వెల్లడించనున్నారు. ఈ మేరకు మండలంలో అన్ని గ్రామాలనుంచి వచ్చిన వాటిని ఆన్‌లైన్‌లో రికార్డు చేస్తున్నారు. భూభారతి చట్టంలో భూసమస్య పరిష్కారానికి మార్గం....

- మిగతా 7వ పేజీలో...

5 రోజులు అంశాలు



ఉపాధ్యాయులకు వేసవిలో శిక్షణ తరగతులను నిర్వహించేందుకు ఉమ్మడి జిల్లాలో విద్యాశాఖ అధికారులు ఏర్పాట్లు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా శిక్షణ తరగతుల్లో భాగంగా నల్లగొండ, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో ఈ నెల 13వ తేదీ నుంచి మూడు విడతలుగా ఈ శిక్షణ తరగతులను కొనసాగిస్తారు. మొదటి విడతగా 13వ తేదీ నుంచి 17వ తేదీ వరకు రెండో విడతలో 20 నుంచి 24వ తేదీ వరకు మూడో విడతలో ఈనెల 27వ తేదీ నుంచి 31వ తేదీ వరకు శిక్షణ తరగతులను నిర్వహించేందుకు నిర్ణయించారు.

- (ఆంధ్రజ్యోతి-నల్లగొండ, భువనగిరి టౌన్)

ఉపాధ్యాయులకు వృత్త్యంతర శిక్షణ

» రేపటి నుంచి శిక్షణ తరగతులు ప్రారంభం
» మూడు విడతలుగా కొనసాగనున్న కార్యక్రమం
» ఉమ్మడి జిల్లాలో హాజరు కానున్న 9,423మంది ఉపాధ్యాయులు

టీచర్లకు శిక్షణ తరగతులను విజయవంతం చేయడంకోసం సోమవారం శిక్షణ తరగతుల ఇంచార్జిలకు, జిల్లా రిసోర్స్ పర్సన్‌లకు సంసిద్ధత సమావేశాన్ని నిర్వహించనున్నారు. ఈ సమావేశంలో ఉపాధ్యాయ శిక్షణను సమర్థవంతంగా నిర్వహించడానికి తీసుకోవాల్సిన అన్ని చర్యలపై చర్చించనున్నారు. మండలస్థాయిలో ప్రైమరీ పాఠశాల ఉపాధ్యాయులకు ఈ నెల 20నుంచి శిక్షణ తరగతులు నిర్వహిస్తారు. ప్రతీ ఉపాధ్యాయుడు శిక్షణ తరగతులకు హాజరుకావాలని, ఏ ఒక్కరికి మినహాయింపు లేదని జిల్లా విద్యాశాఖ అధికారులు స్పష్టం చేశారు. ప్రతీ విడతలో ఐదు రోజుల చొప్పున నిర్వహించే శిక్షణా తరగతులు మూడు విడతలుగా ఈ నెలలో మూడు వారాలపాటు కొనసాగనున్నాయి. మూడు జిల్లాల కలెక్టర్ల ఆదేశాల మేరకు ఈ శిక్షణ తరగతులకు సంబంధించి విద్యాశాఖ అధికారులు కార్యాచరణ సిద్ధంచేసి అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేశారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సుమారు మొత్తం 9,423 మంది వివిధ కేటగిరీల ఉపాధ్యాయులకు..

- మిగతా 7వ పేజీలో...

'ప్రగతి' విద్యార్థుల ప్రతిభ


కె.ఉజ్వల (314), ఎం.షైనీ (1306), సింధు (1847), భవాని(3755)

నల్లగొండ టౌన్, మే 11 (ఆంధ్రజ్యోతి): ఎప్‌సెట్ 2025 ఫలితాల్లో పట్టణంలోని ప్రగతి జూనియర్ కళాశాల విద్యార్థులు రాష్ట్రస్థాయిలో ఉత్తమ ర్యాంకులు సాధించి ప్రతిభచాటారు. కళాశాలకు చెందిన కె.ఉజ్వల 314వ ర్యాంకు సాధించి ప్రథమస్థానంలో నిలిచింది. అదేవిధంగా ఎం.షైనీ 1306, అరిబా తబుసమ్ 1363, పి.సింధూ 1847, నబీయా మహీన్ 2812, బి.భవాని 3755, అమాతుల్ ముజీబ్ షెజాన్ 4294, ఎస్.చరణ్ 4768, కె.సమీరా 5075, కె.యశ్వంత్ 5728, సుహాన ఫిర్దోస్ 5960, ఎస్.సాయిమిత్రా 7055, టి.శ్రీలక్ష్మి 7100, వి.దీక్ష 7464, పి.హాసిని 7561, బి.శిరిష 8031, కె.బాలాజీ 8379, నిఖిల్ 8653, ఎస్.శ్రీకాంత్ 8785, కె. హాసిని 9304, ఎల్. నితిన్‌సాయి 9681, కె. శ్రేయరెడ్డి 9888 ర్యాంకులతోపాటు మరో 70మంది విద్యార్థులు 15వేల లోపు ర్యాంకులు సాధించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను కళాశాల ఛైర్మన్ చందా కృష్ణమూర్తి, డైరెక్టర్లు ఎ.నరేంద్రబాబు, ఎస్.శశిధర్‌రావు, చందా శ్రీనివాస్, పైళ్ల రమేష్‌రెడ్డి అభినందించారు.

ఎప్‌సెట్ ఫలితాల్లో 'గౌతమి' ప్రభంజనం


ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న గౌతమి కళాశాల యాజమాన్యం

నల్లగొండ టౌన్, మే 11 (ఆంధ్రజ్యోతి): ఎప్‌సెట్ ఫలితాల్లో నల్లగొండ పట్టణంలోని గౌతమి విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో అత్యుత్తమ ఫలితాలు సాధించారు. కళాశాలకు చెందిన ఎండీ ఉజైర్ 165వ ర్యాంకు, యాస్మిన్ 435, భవ్యశ్రీ 737, ఆఫీయాసదాఫ్ 1133, వి.గాయత్రి 1361, బుష్రా 1588, సుసన్న 2090, షైలా ఆలీఖాన్ 2267, సాయినిఖిల 3228, శృతి 3522, హేమచందర్ 4541, మీనాక్షి 5166, రాజారెడ్డి 5183, హితశ్రీ 5391, ఆవుల శివాని 6246, అజయ్ 6355, అంజలి 6365, దీపిక 6448, సాత్విక్‌రెడ్డి 6512, పోలగోని దీపిక 7064, దీక్షితారెడ్డి 7230, శ్రీనిధి 7522, క్రిష్ణ చైతన్య 7682, ఇర్ఫాన్ తబుసమ్ 9778, తితీక్ష 10,504, బొడ్డుపల్లి లలిత 10,684, నవ్య 10,789వ ర్యాంకు సాధించారు. అదేవిధంగా మరో 61మంది విద్యార్థులు 61వేలలోపు ర్యాంకులు సాధించారు. ఈ సందర్భంగా ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను గౌతమీ విద్యా సంస్థల డైరెక్టర్లు కాసాల వెంకట్‌రెడ్డి, చల్లా వెంకటరమణ, కొమ్మిడి రఘుపాల్ రెడ్డి, పుట్ట వెంకటరమణారెడ్డిలు అభినందించారు.

'జయ' కళాశాల విద్యార్థుల ప్రతిభ

సూర్యాపేట అర్బన్, మే 11 (ఆంధ్రజ్యోతి) : ఎప్‌సెట్ ఫలితాల్లో జయ కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చారని జయ కళాశాల కరస్పాండెంట్ జయ వేణుగోపాల్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని కళాశాలలో ఎప్‌సెట్‌లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను అభినందించి, మాట్లాడారు. రాష్ట్రస్థాయిలో 141వ ర్యాంకు, 266వ ర్యాంకు, 695 ర్యాంకు, 913 వ ర్యాంకు, 917వ ర్యాంకులతో పాటు 1000లోపు ఐదుగురు, 5వేలలోపు 11 మంది, 10 వేల లోపు 24 మంది, 25వేలలోపు 53 మంది విద్యార్థులు ర్యాంకులు సాధించారని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్లు బింగి జ్యోతి, జెల్లా పద్మ తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులను అభినందిస్తున్న జయ కళాశాల యాజమాన్యం

యాదగిరీశుడి జయంత్యుత్సవాలు
పరిసమాప్తి
7

'జాస్రిత' విద్యార్థుల హవా


మారియా(526), తబుసుమ్(822)

నల్లగొండ టౌన్, మే 11 (ఆంధ్రజ్యోతి): ఎప్‌సెట్ ఫలితాల్లో జాస్రిత అకాడమీ విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. అగ్రికల్చర్, ఫార్మసీ ఫలితాల్లో మారియా 526వ ర్యాంకు, అర్షియా తబుసుమ్ 822, ఆఫీసా సదాఫ్ 1133, పహాద్ 1284, ఫరియా మేహానిషా 1603, మరి యం 2025, దీక్షిత 2301, షర్వాని 2538, ఇందూ 2851, హిబా అన్వర్ 3068, వర్షిత 3106, జూహా అం జమ్ 3315, ఆఫీయా జబీన్ 3900, మారియా తర న్నుం 4001, హుర్నాజ్ 4312, అక్షర 4500 ర్యాంకు లు సాధించా రు. ఈ సందర్భంగా ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను జాస్రిత అకాడమీ యజమాన్యం అభినందించింది.

ఐఐహెచ్‌టీపై ఆశలు

» గతంలో పోచంపల్లిలో ఏర్పాటుకు ప్రతిపాదనలు
» వేరే జిల్లాలో ఏర్పాటు చేసేందుకు ప్రయత్నాలు
» కార్మికుల విజ్ఞప్తితో మంత్రి తుమ్మల స్పందన
7

సంచికి రెండు కిలోలు!

» తూకాల్లో తేడా » నష్టపోతున్న రేషన్ డీలర్లు

రేషన్ దుకాణాల ద్వారా పేదలకు సన్నబియ్యం అందించాలనే ప్రభుత్వ నిర్ణయం డీలర్లకు తలనొప్పిగా మారింది. సన్నబియ్యం సంచి తూకంలో వస్తున్న తేడాలతో తీవ్రంగా నష్టం వాటిల్లుతోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 50 కిలోల బియ్యం బస్తాను తూకం వేయగా 48 కిలోలకు తక్కువగానే ఉంటున్నాయని ఒక్కో సంచికి రెండు కిలోలకు పైగా తక్కువగా వస్తుందని డీలర్లు ఆరోపిస్తున్నారు. జిల్లాలోని పలువురు డీలర్లు కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. క్వింటాకు ఇచ్చే రూ.150 కమీషన్ కూడా తరుగుతో కోల్పోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- (ఆంధ్రజ్యోతి-భువనగిరి(కలెక్టరేట్)



50 కిలోల బస్తాకు 47,870 కిలోలు చూపిస్తున్న తూకం

యాదాద్రిభువనగిరి జిల్లాలో మొత్తం 515 రేషన్ దుకాణాలకు 2,03,627 ఆహార భద్రతాకార్డులున్నాయి. 6,67,403 యూనిట్లు, 13,696 అంత్యోదయ అన్నయోజన కార్డులు, 38,965 యూనిట్లకు సన్నబియ్యం పంపిణీ జరుగుతోంది. జిల్లాలో ఉన్న ఐదు పౌర సరఫరాల శాఖ గోదాంలు భువనగిరి, ఆలేరు, మోత్కూరు, రామన్నపేట, చౌటుప్పల్ నుంచి ప్రతినెలా జిల్లాకు 4 వేల మెట్రిక్ టన్నులకు పైగా బియ్యం సరఫరా అవుతున్నట్లు అధికారులు చెబుతున్నారు. కార్డుదారులు రేషన్ దుకాణాలకు వెళ్లి ఒక వ్యక్తికి 6 కిలోల చొప్పున వారికి వచ్చే బియ్యంఎలక్ట్రానిక్ కాంటాపై సరితూగినప్పుడు బయోమెట్రిక్ విధానం నమోదుచేస్తేనే రశీదు వస్తుంది. దీంతో లబ్ధిదారులకు గ్రాము బియ్యం తగ్గకుండా బియ్యం సక్రమంగా సరఫరా అవుతున్నాయి.

బియ్యం కొనుగోలుపై లబ్ధిదారుల్లో ఆసక్తి

రాష్ట్ర ప్రభుత్వం ఉగాది నుంచి సన్న బియ్యం పంపిణీ చేస్తుండటంతో లబ్ధిదారులు రేషన్ బియ్యం తీసుకెళ్లడానికి ఆసక్తి చూపిస్తున్నారు. గతంలో దొడ్డుబియ్యం తీసుకెళ్లే వారు కాదు. దీంతో డీలర్లకు తరుగు వస్తున్నా కొంత మేర ఉపశమనం కలిగేది. అయితే రెండు నెలలుగా లబ్ధిదారులు సన్నం బియ్యం తీసుకెళ్తున్నారు. తూకం వేశాకే బిల్లు వస్తుండటంతో లబ్ధిదారుడికి తక్కువగా ఇచ్చే అవకాశం లేదు. దీంతో డీలర్లే నష్టపోవాల్సి వస్తోంది.

సరిపడా బియ్యం ఇవ్వాలి

గోదాముల నుంచి దుకాణాలకు వచ్చేటప్పటికీ బస్తాలలో బియ్యం తగ్గుతోంది. ఒక్కో సంచికి కిలో, కొన్ని సంచుల కు రెండు కిలోలకు పైగా తక్కువగా వస్తోంది. లబ్ధిదారులకు సరిగ్గా తూకం వేసి పంపిణీ చేస్తున్నాం. బియ్యం బస్తాలలో తరుగుతో నష్టం వస్తోంది. దొడ్డుబియ్యం పంపిణీ చేసినప్పుడు కొందరు లబ్ధిదారులు తీసుకెళ్లలేదు. ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీ చేస్తుండటంతో లబ్ధిదారులు అందరూ తీసుకెళ్తున్నారు. తరుగు లేకుండా సరిపడా బియ్యం కేటాయించాలి.

- చల్లూరి పోచయ్య, డీలర్ల సంఘం అధ్యక్షుడు

తరుగుకు అవకాశం లేదు

బియ్యం బస్తాల్లో తరుగు ఉండే అవకాశం లేదు. 50 కిలోల బస్తా అయినప్పటికీ సంచి కొలమానం కాకుండా డీలర్లకు యూనిట్ల వారీగా ఎం లైతే రావాలో ఒకేసారి కాంటా వేసి పంపుతున్నాం. ఇప్పుడు తరుగు ఎందుకు వస్తున్నాయో కారణాలను ఆరా తీస్తాం. ఒక్కోసారి కొన్ని బస్తాల్లో ఎక్కువ బియ్యం కూడా ఉంటాయి. డీలర్లు తరుగు ఎక్కువగా వస్తే ఫిర్యాదుచేయాలి. గోదాంల వద్ద బియ్యం తూకాలు సరిగ్గా జరిగేలా చర్యలు తీసుకుంటాం..

- హరిక్రిష్ణ, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజరు

మైక్రో రుణాల ఉచ్చులో పేదలు

» మళ్లీ విజృంభిస్తున్న మైక్రో ఫైనాన్స్‌లు » గతంలో రుణాలు చెల్లించలేక పలువురి ఆత్మహత్య

గతంలో పలువురు పేద మహిళల ప్రాణాలు బలిగొన్న మైక్రో ఫైనాన్స్‌లు మళ్లీ విజృంభిస్తున్నాయి. పేద కుటుంబాలను ఆర్థికంగా, సామాజికంగా పతనం చేస్తూ వారి పాలిట శాపంగా మారిన మైక్రో ఫైనాన్స్‌లను ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అప్పటి ప్రభుత్వం నిషేధించింది. తిరిగి పురుడుపోసుకున్న మైక్రో ఫైనాన్స్‌లు ప్రజల ఆర్థిక అవసరాలను ఆసరాగా చేసుకుంటూ పడగ విప్పుతున్నాయి. తీసుకున్న రుణాన్ని ప్రతీ వారం చెల్లించాల్సిన మైక్రోఫైనాన్స్‌ల ఊబిలో పేదవర్గాలు కూరుకుపోతున్నాయి. మరోసారి పాత దుర్ఘటనలు పునరావృతం కాకుండా కట్టడి చేయాలని పలువురు కోరుతున్నారు.

- (ఆంధ్రజ్యోతి-భువనగిరి టౌన్)



సమభావన సంఘాలు, స్త్రీనిధి, ముద్ర తదితర రూపకాలలో ప్రభుత్వం రుణాలను అందిస్తున్నప్పటికీ పలువురు మహిళలు తక్షణ ఆర్థిక అవసరాల కోసం మైక్రో ఫైనాన్స్‌లను ఆశ్రయిస్తున్నారు. కానీ తిరిగి చెల్లింపులో ఇబ్బందులకు గురవుతూ మానసిక, ఆర్థిక క్షోభకు గురవుతుండగా నెలవారీగా చెల్లించాల్సిన బ్యాంకు లింకేజీ రుణాలను చెల్లించలేకపోతున్నారు. దీంతో మైక్రో ఫైనాన్స్‌ల ఆగడాలను పురిట్లోనే నియంత్రించాలని మహిళా సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

స్తోమతకు మించి మైక్రో రుణాలు..

భారత బ్యాంకింగ్ వ్యవస్థలో రుణాల చెల్లింపులో మహిళా సంఘాలే అగ్రగామిగా ఉంటున్నాయి. ఏ ఒక్క సభ్యురాలు రుణ వాయిదాల చెల్లింపులో ఆలస్యం చేసినా మిగతా సభ్యులు బాధ్యత వహిస్తూ ఆ మహిళతో రుణ వాయిదా చెల్లింపచేయడమో లేదా తామే భరించడమో చేస్తున్నారు. దీంతో మహిళా సంఘాల రికవరి సుమారు 100 శాతంగా ఉంటోంది. దీంతో మహిళల ఆర్థిక అవసరాలు, రుణాల చెల్లింపులో నిజాయితీని ఆసరాగా చేసుకుంటూ పలు మైక్రోఫైనాన్స్‌లు విజృంభిస్తున్నాయి. ఆర్‌బీఐ అనుమతులు, నిబంధనల మేరకే మైక్రో రుణాల మంజూరు ప్రక్రియను నిర్వహిస్తున్నామంటూ మైక్రోఫైనాన్స్‌ల ఏజెంట్లు పట్టణాలలోని బస్తీలు, గ్రామాల్లో ఇల్లిల్లు తిరుగుతున్నారు. 10 మందితో సంఘాలు ఏర్పాటు చేయించి రుణ మంజూరు తంతును పూర్తిచేసి వారంవారం రుణ వాయిదాలను వసూలు చేస్తున్నారు. మొదటి విడతగా ఒక్కో సభ్యురాలికి రూ.30వేల మైక్రో రుణం మంజూరు చేస్తూ క్రమేపీ రుణ పరపతిని పెంచుతున్నారు. అంతేకాక ఆస్తులపై మార్టిగేజీ లోన్‌లు కూడా ఇస్తున్నారు. దీంతో పలువురు మహిళలు సంఘాలుగా ఏర్పడిన స్తోమతకు మించి మైక్రో రుణాలను స్వీకరిస్తూ చెల్లించలేక చతకిలా పడుతున్నారు. రుణ వాయిదా చెల్లించే రోజున ఇంటికి తాళం పెట్టి వెళ్తున్న సందర్భాలు, ఫోన్‌లో అందుబాటులో ఉండని పరిస్థితులు పెరుగుతున్నాయి. దీంతో సంఘం మిగతా సభ్యులు, మైక్రో ఫైనాన్స్ ప్రతినిధులు సభ్యురాళ్ల ఇంటి ముందు గొడవలు చేస్తున్నారు. గతంలో రుణ గ్రహీతలు అయిన సభ్యురాళ్లు మరణిస్తే రుణ చెల్లింపు జరిపే వరకు అంత్యక్రియలు నిర్వహించకుండా అడ్డుకున్న పరిస్థితులు ఉండేవి. నేడు కూడా అలాంటి దుర్ఘటనలు పునరావృత్తమయ్యే ప్రమాదాలు ఉన్నాయని పలువురు అంటున్నారు.

భువనగిరిలో ఆరు మైక్రోఫైనాన్స్‌లు

యాదాద్రిభువనగిరి జిల్లా కేంద్రమైన భువనగిరిలో ఆరు మైక్రోఫైనాన్స్‌లు కార్యకలాపాలు సాగిస్తున్నాయి. భువనగిరి పట్టణంతో పాటు జిల్లాలోని పలు ప్రాంతాలలో ఇవి రుణాలను అందిస్తున్నాయి. రూ.30 వేల నుంచి రూ.2లక్షల వరకు ఇస్తున్న రుణాలను 48 వారాల్లో సమ వాయిదాలతో చెల్లించాల్సి ఉంటుంది. ఒక్క వాయిదా చెల్లింపులో ఆలస్యం జరిగినా భారీ జరిమానాతో వసూళ్లు చేస్తున్నారు. సకాలంలో వాయిదాలు చెల్లించని రుణ గ్రహీతల పరువును బజారులో నిలదీస్తున్నారు. దీంతో వాయిదాల చెల్లింపునకు కూడా పలువురు మహిళలు అధిక వడ్డీతో అప్పులు చేస్తున్న పరిస్థితి. ఈ క్రమంలో మైక్రో ఫైనాన్స్‌లను నిషేధించాలంటూ ఐద్వా ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు నిర్వహించగా వీబీకేలు ఏకంగా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఇదేతరహా పరిస్థితులు ఉమ్మడి జిల్లా అంతటా ఉన్నాయి.

మైక్రో ఫైనాన్స్‌లను నియంత్రించాలి



మైక్రో ఫైనాన్స్‌లను ప్రభుత్వం వెంటనే నిషేధించాలి. లేనిపక్షంలో పలు పేద కుటుంబాలు విచ్ఛిన్నమయ్యే ప్రమాదాలు ఉన్నాయి. అవగాహన రాహిత్యం, ఆర్థిక అవసరాల కోసం అధికవడ్డీతో రుణాలు తీసుకుంటున్న పలువురు మహిళలు వాయిదాలు చెల్లించలేక మొహం చాటేస్తున్న పరిస్థితి. స్తోమతకు మించి రుణాలు మంజూరు జరుగుతుండడంతో తిరిగి చెల్లించలేక ఆర్థిక అసమానతలు పెరుగుతున్నాయి. ప్రభుత్వం స్పందించకుంటే త్వరలోనే గత దుర్ఘటనలు పునరావృత్తమయ్యే ప్రమాదం ఉంది.

- అనురాధ,ఐద్వా జిల్లా కార్యదర్శి, యాదాద్రి భువనగిరి.

రుణ చెల్లింపులో తడబాటు



మైక్రో ఫైనాన్స్‌ల రుణాలతో సమభావన, స్త్రీ నిధి రుణాలను పలువురు మహిళలు సక్రమంగా చెల్లించలేకపోతున్నారు. మైక్రో రుణ వాయిదా ప్రతీవారం చెల్లించాల్సి ఉండడంతో బ్యాంకు లింకేజీ రుణాలను మహిళలు సక్రమంగా చెల్లించలేకపోతున్నారు. వారం వాయిదా చెల్లింపులో ఏ మాత్రం ఆలస్యం జరిగినా మైక్రో ఫైనాన్స్ ఏజెంట్లు సంబంధిత మహిళలను వేధింపులకు గురిచేస్తున్నారు. దీంతో ప్రభుత్వం మైక్రో ఫైనాన్స్‌లపై చర్యలు తీసుకోవాలి. లేనిపక్షంలో లింకేజీ రుణాల బకాయిలు పెరుగడంతో పాటు పలువురు మహిళల జీవితాల్లో మైక్రో రుణాలు తీవ్ర ప్రభావం చూపే ప్రమాదం ఉంది.

- ఎం పద్మ, వీబీకే, అనంతారం.

మహిళలతో పాటు పురుషులు కూడా సంఘాలుగా ఏర్పడి మైక్రో రుణాలు పొందుతుండటంతో ఆయా కుటుంబాలపై ఆర్థిక భారం మరింత పెరుగుతోంది.

మట్టపల్లి క్షేత్రంలో కన్నుల పండువగా ఎదుర్కోళ్లు

మఠంపల్లి, మే 11 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలం లోని మట్టపల్లి శ్రీలక్ష్మీనృసింహస్వామి క్షేత్రంలో తిరుకల్యాణ మహోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి ఎదుర్కోళ్ల కార్యక్రమం కన్నుల పండువగా సాగింది. రాత్రి రెండుగంటలకు(తెల్లవారితే సోమవారం) జరిగే కళ్యాణానికి నృసింహస్వామిని పెళ్లికుమారుడిగా, భూదేవి, చెంచులక్ష్మి అమ్మవార్లను పెళ్లి కుమార్తెలుగా అలంకరించారు. యాజ్ఞికులు బొర్రా వాసుదేవాచార్యుల ఆధ్వర్యంలో పరాశరం వెంకటాచార్యులు, నారాయణం హరికిరణాచార్యులు బృందంతో ఎదుర్కోళ్ల కార్యక్రమం వైభవంగా నిర్వహించారు.



పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్న అర్చకులు



కల్యాణమండపం ముందు భక్తులు

బ్రహ్మోత్సవాలలో రెండవ రోజు..

మట్టపల్లి లక్ష్మీనృసింహస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో రెండవరోజైన ఆదివారం కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. ఉదయం ఆరు గంటలకు సుప్రభాతం, ప్రాతఃకాలార్చనలు, ఏడు గంటలకు స్వామివారికి పంచామృతాభిషేకం, తొమ్మిది గంటలకు రాజశేఖరుని లక్ష్మీపతిరావు దంపతులతో మల్లికాపుష్ప, సహస్ర నామార్చనలు, మట్టపల్లి రామయ్య దంపతులతో మార్తి లక్ష్మీనరసింహామూర్తి, జానపాటి సీతారామ శాస్త్రీ ఆధ్వర్యంలో లక్ష మల్లికాపుష్ప పూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయం 10 గంటలకు పూజా కార్యక్రమాలు, సాయంత్రం 4 గంటలకు నాదస్వర కచేరి, ఐదు గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు సంగీత విభావరి, కోలాట ప్రదర్శన, హరికథా కాలక్షేపం, నామసంకీర్తన కార్యక్రమాలు కొనసాగాయి. రాత్రి 12 గంటలకు ఉత్సవమూర్తులకు ఎదుర్కోళ్లు నిర్వహించి, వేదమంత్ర పఠనంతో సమస్త మంగళ వాయిద్యాలతో కళ్యాణ మండపం వరకు భక్తజనుల ఊరేగింపుతో తీసుకువచ్చారు. పూజాకార్యక్రమాల్లో ఆలయ ధర్మకర్తలు చెన్నూరి మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈవో సిరికొండ నవీన్‌లు తెలిపారు. ఉత్సవ ఏర్పాట్లను హుజూర్‌నగర్ ఆర్డీవో శ్రీనివాసులు, సీఐ చరమందరాజు, తహసీల్దార్ మంగా, ఎస్ఐ బాబు పర్యవేక్షించారు.

ఇరుముడులతో దీక్షాదారులు

లక్ష్మీనరసింహ మండల దీక్షలు చేపట్టిన భక్తులు 40రోజులు పూర్తికావడంతో మట్టపల్లి క్షేత్రంలో దీక్షలను విరమించనున్నారు. ఈ క్రమంలో మఠంపల్లి, బీల్యానాయక్‌తండా, చౌటపల్లి, పెదవీడు, రఘునాథపాలెం,యాతవాకిళ్ల, దొనబండ తండా, లాలితండా, తుమ్మలతండా గ్రామాలకు చెందిన స్వాములు ఆయా గ్రామాల్లోని దేవాలయాల్లో ఆదివారం పూజలు నిర్వహించి గురుస్వాముల ఆధ్వర్యంలో ఇరుముడులు ధరించి కాలినడకన మట్టపల్లికి చేరుకున్నారు. రాత్రి కల్యాణోత్సవాన్ని తిలకించి, సోమవారం స్వామి సన్నిధిలో దీక్షలు విరమించనున్నారు.

మూడేళ్లుగా వడదెబ్బ మృతులే లేరట!

(ఆంధ్రజ్యోతి-సూర్యాపేట)



వడదెబ్బతో మృతి చెందిన జానమ్మ(ఫైల్)

వడదెబ్బకు గురై పలువురు చనిపోతున్నప్పటికీ వారి కుటుంబ సభ్యులకు ప్రభుత్వ పరిహారం అందడంలేదు. సూర్యాపేట జిల్లాలో ఎక్కువగా ఉపాధి హామీ పనులకు వెళ్లి కూలీలు వడదెబ్బకు గురై చనిపోతున్నారు. అయినప్పటికీ రికార్డుల్లో ఎవరినీ నమోదు చేయలేదు. గతంలో ప్రభుత్వ ఆర్థిక సహాయం రూ.50వేలు ఉండగా ప్రస్తుతం రూ.4లక్షల వరకు పెంచింది. వాస్తవానికి మూడేళ్లలో 21మంది వడదెబ్బతో చనిపోయారని అనధికారిక సమాచారం. ప్రభుత్వ రికార్డుల ప్రకారం నేటికీ ఎవరిని గుర్తించలేదు.

త్రిమన్ కమిటీతో గుర్తింపు

వడదెబ్బకు గురైన చనిపోయిన వారి వివరాలను కుటుంబ సభ్యులు తహసీల్దార్‌కు అందించాలి.తహసీల్దార్, ఎస్ఐ, డాక్టర్ పరిశీలించి వివరాలు సేకరిస్తారు. ఇతరత్రా జబ్బులు ఉన్నాయో లేదో ఆరా తీస్తారు. అనంతరం వారు నివేదికను కలెక్టరేట్‌కు అందజేస్తారు. ప్రభుత్వానికి ఆ నివేదికను జిల్లా స్థాయి అధికారిని పంపించి మృతుల కుటుంబసభ్యులకు ఆర్థికసాయం ఇస్తారు.

త్రిమన్ రిపోర్టు ఆధారంగా ప్రభుత్వసాయం

వడదెబ్బకు గురై చనిపోయిన వారిని తహసీల్దార్, డాక్టర్, ఎస్ఐ పరిశీలించి నివేదిక అందజేస్తారు. దాని ప్రకారం కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం అందుతుంది.

రాంబాబు, అదనపు కలెక్టర్


ఇటీవల ముగ్గురు

చిలుకూరు మండలం కొడారు కోటయ్య(58) 15రోజుల క్రితం ఉపాధి పనులకు వెళ్లి అదే రోజు వడదెబ్బకు గురైచనిపోయారు. 12 రోజుల క్రితం ఆత్మకూరు(ఎస్) మండలం గట్టికల్ గ్రామా నికి చెందిన తలారీ నర్సయ్య(58) ఉపాధి పనికి వెళ్లి వడదెబ్బతో చనిపోయారు. తహసీల్దార్ విచారణ పూర్తయ్యింది. అదేవిధంగా మిద్దనపల్లి గ్రామానికి చెందిన పాశం జానమ్మ(80) ఉపాధి పనులకెళ్లి వారం కిందట అస్వస్థతకు గురై ఆసుపత్రిలో చికిత్సపొందుతూ ఈ నెల 8న చనిపోయింది.

ఇతరత్రా జబ్బులున్నాయని..

వడదెబ్బతో చనిపోయినప్పుడు అతడికి గతంలోనే స్టంట్ వేశారని, గుండెపోటుతోనే చనిపోయారని త్రిమన్ కమిటీ నివేదిక ఇవ్వడంతో వడదెబ్బ మృతుల కుటుంబసభ్యులకు నష్టపరిహారం అందడంలేదు. పాశం జానమ్మకు కాలుకు దెబ్బ తగిలి ఉండడంతో దాంతో చనిపోయినట్లు అధికారులు చెప్పడం విడ్డూరంగా ఉందని గ్రామస్థులు తెలిపారు. చనిపోయిన వారి పోస్టుమార్టం నివేదిక ఇవ్వాల్సి ఉంటుంది. అంతేకాక వాతావరణ నివేదికను తెప్పించుకుంటున్నారు. 45 డిగ్రీల ఉష్ణోగ్రత కంటే ఎక్కువ ఉండాలి. అప్పుడే అర్హులవుతారు. ఇన్ని నిబంధనలతో జిల్లాలో ఏ ఒక్కరికీ ప్రభుత్వం నుంచి ఆర్థికసహాయం అందే మార్గంకనిపించడం లేదు. ఉష్ణోగ్రతలు పెరిగిపోవడం, మండుతున్న ఎండల్లో పనిచేయడం వల్లే ఎక్కువ మంది వడదెబ్బకు గురవుతున్నారు.

సాగర్ సమాచారం



పూర్తిస్థాయి నీటి మట్టం	590.00 అడుగులు
టీఎంసీలు	312.0450
ప్రస్తుత నీటి మట్టం	513.40
టీఎంసీలు	137.5158
ఎడమకాల్వకు నీటి విడుదల	నిల్
కుడికాల్వకు	నిల్
విద్యుత్ కేంద్రం ద్వారా	నిల్
క్రస్ట్ గేట్ల ద్వారా	నిల్
ఎస్ఎల్‌బీసీ ద్వారా	1350 క్యూసెక్కులు
వరద కాల్వ ద్వారా	నిల్
ఇన్‌ఫ్లో	నిల్
అవుట్‌ఫ్లో	1350 క్యూసెక్కులు
ఎన్ని గేట్ల ద్వారా	0

ఎప్‌సెట్‌లో మెరిసిన ఉమ్మడి జిల్లా విద్యార్థులు



బుర్రి రిషిక్‌కుమార్



మురారిశెట్టి రుత్విక్‌మణిసాయి



నారెడ్డి నితిన్‌రెడ్డి



దొంతిరెడ్డి శరణ్‌జిత్‌రెడ్డి



బుడిగె జాహ్నవి



బూరుగు హాసిని

ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన పలువురు విద్యార్థులు ఆదివారం వెలువడిన ఎప్‌సెట్ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచారు. ఇంజనీరింగ్‌తో పాటు అగ్రికల్చర్ విభాగంలో ఉత్తమ ర్యాంకులు సాధించారు.

మునగాల రూరల్, మే 11 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా మునగాల మండలంలోని కలకోవ గ్రామానికి చెందిన బుర్రి శ్రీనివాసరావు, విజయలక్ష్మి దంపతుల కుమారుడు రిషిక్‌కుమార్ ఎప్‌సెట్‌లో 27వ ర్యాంక్ సాధించారు.

నల్లగొండ: నల్లగొండ జిల్లాకేంద్రానికి చెందిన మురారిశెట్టి రుత్విక్‌మణిసాయి 57వ ర్యాంకు సాధించాడు. తల్లిదండ్రులు శ్రీనివాస్, రాధాకుమారి ప్రభుత్వ టీచర్లుగా పనిచేస్తున్నారు.

నిడమనూరు: నల్లగొండ జిల్లా నిడమనూరు మండలం బొక్కమంతలపహాడ్ గ్రామానికి చెందిన నారెడ్డి నితిన్‌రెడ్డి ఎప్‌సెట్‌లో 640వ ర్యాంక్ సాధించారు. గ్రామానికి చెందిన నారెడ్డి జాన్‌రెడ్డి, శ్రీలక్ష్మి దంపతుల కుమారుడు నితిన్‌రెడ్డి హైదరాబాద్‌లోని నారాయణ కళాశాలలో ఇంటర్ చదివాడు.

నేరేడుచర్ల:ఎప్‌సెట్‌లో అగ్రికల్చర్ విభాగంలో సూర్యాపేట జిల్లా నేరేడుచర్లలోని శ్రీవాణి ఇంగ్లీషుమీడియం స్కూల్ పూర్వ విద్యార్థి దొంతిరెడ్డి శరణ్‌జిత్‌రెడ్డి 1,236వ ర్యాంకు సాధించినట్లు స్కూల్ డైరక్టర్ కొణతం సీతారాంరెడ్డి తెలిపారు.

కట్టంగూరు : నల్లగొండ జిల్లా కట్టంగూరుకు చెందిన బుడిగె జాహ్నవి అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ విభాగంలో 80.46 మార్కులు సాధించి 2,599 ర్యాంకు సాధించింది. జాహ్నవిని తల్లిదండ్రులు సైదులు, అనూష అభినందించారు.

గరిడేపల్లి: సూర్యాపేట జిల్లా గరిడేపల్లికి చెందిన బూరుగు హాసిని 1280వ ర్యాంక్ సాధించింది. హాసినిని తల్లిదండ్రులు శంకర్, సంతోషితో పాటు గ్రామస్థులు అభినందించారు.

రెండు ఆటోలు ఢీకొని ముగ్గురికి గాయాలు

ఆలేరు, మే 11 (ఆంధ్రజ్యోతి) : రెండు ఆటోలు ఢీకొన్న సంఘటనలో ముగ్గురు ప్రయాణికులు గాయపడ్డారు. ఈ ప్రమాదం శనివారం రాత్రి యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు జాతీయ రహదారిపై జరిగింది. ఇందుకు సంబంధించి సీఐ కొండల్ రావు ఆదివారం తెలిపిన వివరాల ఇలా ఉన్నాయి. జనగాం జిల్లా లింగాలఘనపురం మండలం కుందారం గ్రామానికి చెందిన చింత ప్రభాకర్, చింత లక్ష్మి, చింత అన్నపూర్ణమ్మ కుటుంబసభ్యులు ఆటోలో హైదరాబాద్‌లో బంధువుల వివాహానికి హాజరయ్యేందుకు బయలుదేరారు. ఆటో ఆలేరులోని బీసీ కాలనీ సమీపంలోకి చేరుకుంటుండగా జనగాం వైపు వెళ్తున్న మరో ఆటో ఢీకొట్టింది. దాంతో ప్రభాకర్ ఆటోలోని ముగ్గురు ప్రయాణికులకు గాయాలయ్యాయి. వెంటనే వారిని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి పోలీసులు తరలించారు. చింత లక్ష్మి తీవ్రంగా గాయపడటంతో మెరుగైన చికిత్స కోసం జనగాంలోని ప్రైవేటు ఆసుపత్రికి ఆమెను తరలించారు. ప్రభాకర్ ఫిర్యాదు మేరకు ఆలేరుకు చెందిన ఆటో డ్రైవర్ శ్రీనివాస్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

భువనగిరి బస్టాండ్‌లో గుర్తుతెలియని మృతదేహం లభ్యం



గుర్తుతెలియని మృతదేహం

భువనగిరి టౌన్, మే 11 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రిభువనగిరి జిల్లా కేంద్రంలోని బస్టాండ్‌లో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం ఆదివారం లభించింది. పట్టణ ఎస్ఐ లక్ష్మీనారాయణ తెలిపిన వివరాల ప్రకారం సుమారు 38 సంవత్సరాల వయస్సు గల వ్యక్తి బస్టాండ్‌లోని హైదరాబాద్ ప్లాట్‌ఫారంపై విగతజీవిగా పడి ఉన్నాడు. గమనించిన బస్టాండ్ అధికారులు ఇచ్చిన సమాచారం మేరకు మృతదేహాన్ని జిల్లా ఆసుపత్రికి తరలించి మార్చురీలో భద్రపరిచినట్లు తెలిపారు. వడదెబ్బకు గురై లేదా అనారోగ్య కారణాలతో మృతి చెంది ఉంటాడని భావిస్తున్నామన్నారు. మృతదేహంపై తెల్ల షర్ట్, బ్లాకలర్ పాయింట్ ఉన్నాయని ఎస్ఐ తెలిపారు. ఆనవాళ్లు తెలిసిన వారు భువనగిరి పట్టణ పోలీసులను సంప్రదించాలని ఎస్ఐ సూచించారు.

గీత కార్మికుడికి గాయాలు

వలిగొండ, మే 11 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రిభువనగిరి జిల్లా వలిగొండ మండలం పహిల్వాన్‌పూర్‌లో తాటి చెట్టు పైనుంచి జారిపడి గీత కార్మికుడు తీవ్రంగా గాయపడ్డాడు. గ్రామానికి చెందిన వట్టిపల్లి ముత్యాలు కల్లు గీసేందుకు తాటి ఎక్కుతూ జారిపడ్డాడు. దీంతో అతడిని 108 అంబులెన్స్‌లో రామన్నపేట ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుత అతడి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉంది. గాయపడిన గీత కార్మికుడిని ప్రభుత్వం ఆదుకోవాలని స్థానికులు కోరారు.

ఊరెళ్లి వచ్చేలోగా దొంగతనం

నేరేడుచర్ల, మే 11(ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా నేరేడుచర్లలోని 5వ వార్డు ఎన్టీఆర్‌నగర్‌లో ఆదివారం దొంగలు పడి రూ.15వేలు నగదు, 10 తులాల వెండి, 4 గ్రాముల బంగారం వస్తువులు అపహరించినట్లు ఏఎస్ఐ రాములునాయక్ తెలిపారు. మహ్మద్ ఇస్మాయిల్ స్థానిక పశువైద్యశాలలో అటెండర్‌గా పనిచేస్తున్నారు. భార్య కౌసర్‌అంజుమ్ మిర్యాలగూడలోని తల్లిదండ్రుల వద్దకు వెళ్లింది. ఆదివారం సెలవు కావడంతో ఇస్మాయిల్ ఇంటికి తాళం వేసి భార్య వద్దకు మిర్యాలగూడ వెళ్లాడు. తిరిగి సాయంత్రం నాలుగు గంటల సమీపంలో ఇంటికి రాగా తాళం విరగ్గొట్టి తలుపులు తెరిచి ఉన్నాయి. లోనికి వెళ్లి ఇంట్లో ఉన్న నగదు, బంగారు, వెండి వస్తువులు పోయినట్లు గుర్తించి ఇస్మాయిల్ ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్‌లో కాపర్‌వైర్ చోరీ

మునగాల, మే 11 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా మునగాల మండల కేంద్రంలో సాగర్ ఎడమ కాల్వ ఫస్ట్ లిఫ్ట్ సమీపంలోని ట్రాన్స్‌ఫార్మర్‌లో కాపర్ వైర్ చోరీకి గురైంది. ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం ఎల్-33 ఫస్ట్ లిఫ్ట్ సమీపంలోని 3.5 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఈ నెల 9న అర్ధరాత్రి ధ్వంసం చేసి దానిలోని కాపర్ వైర్‌ను చోరీ చేశారన్నారు. రైతు గడ్డం వెంకన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అదుపు తప్పి ఇటుక బట్టీలోకి దూసుకెళ్లిన కారు

హుజూర్‌నగర్, మే 11 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ పట్టణం మిర్యాలగూడ రోడ్డులోని గోపాలపురం సమీపంలో ఆదివారం కారు అదుపుతప్పి ఇటుక బట్టీలోకి దూసుకెళ్లింది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం హుజూర్‌నగర్‌కు చెందిన పల్లేటి సుందర్ కారులో మిర్యాలగూడలోని బంధువుల పెళ్లికి మధ్యాహ్నం బయలుదేరారు. కాగా గోపాలపురంలోని ఓ పెట్రోల్ బంక్ సమీపంలోకి రాగానే బైక్ అడ్డురావడంతో దాన్ని తప్పించబోగా అదుపుతప్పి సమీపంలోని ఇటుకబట్టీని బలంగా ఢీ కొట్టాడు. అదే సమయంలో కారులోని ఎయిర్‌బెలూన్లు తెరుచుకున్నాయి. కాగా కారులో ప్రయాణిస్తున్న పల్లే రాములమ్మ వెన్ను పూసకు గాయం కాగా సూర్యాపేట ఆసుపత్రికి తరలించారు. మిగిలిన వారికి ఎలాంటి గాయాలు కాకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.



ఇటుకబట్టీలోకి దూసుకెళ్లి కారు

భూముల రికార్డులు ఇక పదిలం

(5వపేజీ తరువాయి)

కూడా రెవెన్యూ అధికారులే చూపించాలి. అవసరమైతే ప్రత్యేక భూ ట్రిబ్యునల్‌కు వెళ్లే అవకాశం ఉంది. ఈనేపథ్యంలో భూ భారతి చట్టం ప్రకారం రెవెన్యూ అధికారులు వారి పరిధిలో ఉన్న అన్ని సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించి, కోర్టు కేసులు, వివాదాలు ఉన్న వాటికి న్యాయ సలహాలు ఇవ్వనున్నారు. కొత్తచట్టం ద్వారా గ్రామం, మండలాల వారీగా వ్యవసాయ,వ్యవసాయేతర, సాగులో లేని భూముల వివరాలు స్పష్టంగా తేలనున్నాయి. ఈ కార్యక్రమం ఒక రకంగా గ్రామ స్థాయి భూముల రికార్డులను ప్రక్షాళన చేయడమే లక్ష్యంగా కార్యక్రమం కొనసాగుతోంది.

15వరకు దరఖాస్తుల స్వీకరణ

ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన భూ భారతి చట్టంపై ప్రజలకు పూర్తిస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నాం. భూముల రికార్డుల పరంగా ప్రజలకు ఉన్నటువంటి సందేహాలను నివృత్తి చేయడంతో పాటు భూభారతి వల్ల కలిగే ప్రయోజనాలను సదస్సుల్లో వివరిస్తున్నాం. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని ఆత్మకూరు.ఎం మండలాన్ని భూభారతి చట్టం పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసింది. గ్రామాల్లో సభలు, సమావేశాలు నిర్వహించి, భూ సమస్యలపై దరఖాస్తులను స్వీకరిస్తున్నాం. ఈ నెల 15వరకు దరఖాస్తులను స్వీకరించనున్నాం. 30వ తేదీలో అన్ని గ్రామాల్లో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి, వారికి సమస్యల పరిష్కారంపై వివరంగా తెలియజేయనున్నాం.

- జి.వీరారెడ్డి, అదనపు కలెక్టర్ (రెవెన్యూ)

ఐఐహెచ్‌టీపై చిగురిస్తున్న ఆశలు



- గతంలో పోచంపల్లిలో ఏర్పాటుకు ప్రతిపాదనలు, మంజూరు
- వేరే జిల్లాలో ఏర్పాటు చేసేందుకు కొంతకాలంగా ప్రయత్నాలు
- కార్మికుల విజ్ఞప్తితో ఇక్కడే ఏర్పాటుకు కృషి చేస్తానన్న మంత్రి తుమ్మల

దేశంలోనే అత్యుత్తమ చేనేత నైపుణ్య సంస్థగా 'ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ'కి మంచి పేరు ఉంది. చేనేతకు ఐఐహెచ్‌టీని ఐఐటీ మాదిరిగా పరిగణిస్తారు. అయితే రాష్ట్రంలోని అతి పెద్ద చేనేత కేంద్రమైన పోచంపల్లిలోనే ఐఐహెచ్‌టీ ఏర్పాటుచేయాలని కొన్నేళ్లుగా పోరాటాలు జరిగాయి. పద్మశాలి చేనేత సంఘాలు ఈ అంశంపై పదేళ్లుగా అనేక పోరాటాలు నిర్వహించారు. పద్మశాలి, చేనేత కార్మిక సంఘాలు దీనిపై అనేక విజ్ఞాపనలూ చేశాయి. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం కేంద్రానికి వినతులు అందించింది. కేంద్రం సానుకూలంగా స్పందించి ఎట్టకేలకు తెలంగాణాకు ఐఐహెచ్‌టీ సంస్థను మంజూరు చేసింది.

- (ఆంధ్రజ్యోతి - భూదాన్‌పోచంపల్లి)

కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి మంజూరు చేసిన ఐఐహెచ్‌టీ సంస్థను ప్రపంచ ఉత్తమ పర్యాటక గ్రామం భూదాన్‌పోచంపల్లిలో ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసింది.ఇందుకోసం మండలంలోని కనుముకుల గ్రామంలో ప్రభుత్వం స్వాధీనం చేసుకున్న పోచంపల్లి హ్యాండ్లూమ్ పార్క్‌లో ఐఐహెచ్‌టీ సంస్థ ఏర్పాటుకు ఉత్తర్వులు గత ఏడాదిలోనే జారీ చేశారు. దీంతో ఎన్నో ఏళ్లుగా కలలు గన్న ఐఐహెచ్‌టీ సంస్థ సాకారం అయ్యిందని, నేత కార్మికుల సంబురపడ్డారు.

సానుకూల అంశాల.. వసతులు

రాష్ట్రంలో నలభై వేల చేనేత కుటుంబాలు ఉండగా, అత్యధికంగా భూదాన్‌పోచంపల్లిలోనే చేనేత కార్మికులు ఉన్నారు. పెద్దఎత్తున వస్త్ర వ్యాపారం, తయారీ రంగం ఉంది. ఇక్కడ ఐఐహెచ్‌టీ ఏర్పాటైతే చేనేత, జౌళీ డిప్లొమా డిగ్రీ, పీజీ కోర్సులతో పాటు పరిశోధనలు, అభివృద్ధి అధ్యయనాలు జరిగే వీలుంది. దీంతో చేనేత పరిశ్రమ మరింత బలోపేతం కానుంది. కనుముకుల గ్రామశివారులోని పోచంపల్లి హ్యాండ్లూమ్ పార్క్‌లో భవనాలు కూడా అందుబాటులో ఉన్నాయి. ఇది 26 ఎకరాల విస్తీర్ణంలో ఉండటం పాటు పార్క్‌లోని విశాలమైన భవనాలు సంస్థ నిర్వహణకు అనుగుణంగా ఉన్నాయి.

ఐఐహెచ్‌టీ తరలింపునకు యత్నాలు

ఐఐహెచ్‌టీని భూదాన్‌పోచంపల్లికి మంజూరు చేసినప్పటికీ ఇక్కడి నుంచి ఇతర ప్రాంతాలకు తరలించేందుకు ప్రయత్నించారన్న విమర్శలు వినవస్తున్నాయి. మహబూబ్‌నగర్ జిల్లాకు ఐఐహెచ్‌టీ తరలించేందుకు ప్రయత్నాలు సాగిస్తున్నారని ప్రచారం సాగుతోంది. అయితే ఐఐహెచ్‌టీ ఏర్పాటు పోచంపల్లిలో ప్రారంభించేందుకు సమయాభావంతో గత ఏడాదిగా తాత్కాలికంగా హైదరాబాద్‌లో పొట్టి శ్రీరాములు యూనివర్సిటీలో ఏర్పాటుచేశారు. ఆ తర్వాత ఇక్కడే ఏర్పాటు చేస్తారని అందరూ ఊహించారు. అయితే వచ్చే విద్యాసంవత్సరం నుంచి ఫోర్త్ సిటీలోని స్కిల్ యూనివర్సిటీలో ఐఐహెచ్‌టీ ఏర్పాటు చేస్తారన్న ప్రచారం సాగింది. దీంతో ఇటు స్థానిక ఎమ్మెల్యే, అధికారులు ఏమి చేయలేక చేతులెత్తేశారు.

మంత్రి మాటలతో

ఈ నెల 2న భూదాన్‌పోచంపల్లిలో జరిగిన చేనేత సదస్సుకు హాజరైన మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ఐఐహెచ్‌టీ ప్రస్తావన తేవడంతో అందరిలో ఆశలు చిగురించాయి. ఐఐహెచ్‌టీని పోచంపల్లిలోనే ఏర్పాటుచేయాలని పలువురు చేనేత నాయకులు వినతిపత్రం అందించి ఆయన దృష్టికి తేవడంతో ఆయన స్పందిస్తూ పోచంపల్లిలో ఐఐహెచ్‌టీ ఏర్పాటుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. దీంతో చేనేత వర్గాల్లో మరోసారి ఆశలు చిగురించాయి. ఈ నేపథ్యంలో పోచంపల్లిలో ఐఐహెచ్‌టీ ఏర్పాటు చేయాలనే డిమాండ్ వివిధవర్గాల నుంచి మళ్లీ వస్తున్నాయి. స్థానిక ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డిలపై స్థానిక చేనేత నాయకులు ఒత్తిడి తెస్తున్నారు. ఐఐహెచ్‌టీ ఏర్పాటుకు అన్ని వనరులు, వసతులు ఉన్న కనుముకుల గ్రామ శివారులోని పోచంపల్లి హ్యాండ్లూమ్ పార్క్‌లో ఏర్పాటుచేయాలని అన్ని వర్గాల ప్రజలు రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.

ఐఐహెచ్‌టీ తరలించేందుకు కుట్ర



కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు ప్రకటించిన ఐఐహెచ్‌టీ పోచంపల్లికి మంజూరు చేయగా, ప్రభుత్వ పెద్దలు తమ స్వార్థంతో తరలించుకుపోయేందుకు కుట్ర చేశారు. చేనేతకు తలమానికమైన భూదాన్‌పోచంపల్లిలో ఐఐహెచ్‌టీ ఏర్పాటు చేస్తేనే సార్థకత ఉంటుంది. ఈ మండలంలోని స్వామి రామానందతీర్థ గ్రామీణ సంస్థ, కనుముకులలోని పోచంపల్లి హ్యాండ్లూమ్ పార్క్‌లో ఐఐహెచ్‌టీ ఏర్పాటుకు అవసరమైన వనరులు ఉన్నాయి. అనుకూలమైన భవనాలు, వసతులు ఉన్నాయి. ఈ ప్రాంతంలోని చేనేత కార్మికులకు ప్రయోజనం చేకూరాలంటే ఇక్కడే ఐఐహెచ్‌టీ ఏర్పాటు చేయాలి.

- కొంక లక్ష్మీనారాయణ, చేనేత సంఘం నాయకులు, భూదాన్‌పోచంపల్లి

పోచంపల్లిలో ఐఐహెచ్‌టీ ఏర్పాటు చేయాలి



ఐఐహెచ్‌టీ సంస్థను భూదాన్‌పోచంపల్లిలోనే ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. భూదానోద్యమం, చేనేత వస్త్ర తయారీతో పాటు ప్రపంచ ఉత్తమ గ్రామీణ పర్యాటక కేంద్రం గా పేరొందిన, చారిత్రక నేపథ్యం కలిగిన, సంప్రదాయ చేనేత కళకు పుట్టినిల్లు పోచంపల్లి. మారుతున్న కాలానికి అనుగుణంగా చేనేత కార్మికులు తమ వృత్తిలో నైపుణ్యాన్ని పెంపొందించుకోవడానికి ఐఐహెచ్‌టీ సాంకేతికత దోహదపడుతుంది. భావితరాల వారికి ఐఐహెచ్‌టీ ఎంతగానో తోడ్పడుతోంది.

- అంకం పాండు, చేనేత కార్మిక సంఘం అధ్యక్షుడు, భూదాన్‌పోచంపల్లి

వృత్తి నైపుణ్యంతో భావి తరాలకు ప్రయోజనం



చేనేత కళాకారులకు వృత్తి నైపుణ్యంలో శిక్షణ ఇస్తే మరింత నిష్ణాతులుగా తయారవుతారు. చేనేత కళాకారులకు అందుబాటులో ఐఐహెచ్‌టీని ఏర్పాటు చేస్తే పోచంపల్లి ఇక్కత్ పరిశ్రమ పటిష్టమవుతోంది. చేనేత పరిశ్రమపై ఆధారపడిన వారికి నూతన టెక్నాలజీతో వస్త్ర వ్యాపారం మరింతగా పెరిగి ఉపాధి కలుగుతుంది. కళాకారులు, కార్మికుల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయి. చేనేత పరిశ్రమ అభివృద్ధికి తోడ్పాటు అందించిన వారవుతారు. అందుకే పోచంపల్లిలో ఐఐహెచ్‌టీ ఏర్పాటు అత్యంత ఆవశ్యం.

- భారత లవకుమార్, పోచంపల్లి చేనేత టై అండ్ డై అసోసియేషన్ అధ్యక్షుడు

గోవిందా.. గోవిందా

● ఏకశిఖరవాసుడికి 'గిరి' ప్రదక్షిణోత్సవం ● స్వాతి నక్షత్ర వేడుకలు ● ఉప్పొంగిన భక్తిపరవశం



గర్భాలయానికి అభిముఖంగా సహస్ర కలశాభిషేకానికి పూజలు చేస్తున్న ప్రభుత్వ విప్ ఐలయ్య, కలెక్టర్

యాదగిరిగుట్ట, మే 11 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామివారి ఆలయం లో ఆదివారం స్వాతి నక్షత్ర వేడుకలు.. గిరి ప్రదక్షిణ పర్వాలు వైభవంగా కొనసాగాయి. కొండ కింద వైకుంఠ ద్వారం చెంత దేవస్థానం ఆధ్వర్యంలో తెల్లవారు జామున ఉదయం 5.45 గంటలకు గిరి ప్రదక్షిణను దేవాదాయ శాఖ డైరెక్టర్, ఈవో ఎస్. వెంకట్రావు, ఐఏఎస్ శరత్‌తో కలిసి ప్రారంభించారు. వేకువజామునే వైకుంఠద్వారం చెంతకు ఐదు వేల మంది భక్తులు చేరుకున్నారు. ఈ సంఖ్య స్వామివారి మధ్యాహ్నం ఆరగింపు వేళ వరకు 30వేలకు చేరింది. గిరి ప్రదక్షిణలో స్వామివారిని స్తుతిస్తూ ప్రత్యేకంగా కళాకారుల కూచిపూడి నృత్యాలు, భక్తుల భజనలు, కీర్తనల తో హోరెత్తించారు. గిరి ప్రదక్షిణకు ఓబీసీ సెంట్రల్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు కాదూరి అచ్చయ్య నేతృత్వంలో 100మంది మహిళా భక్తులు, అఖిల భారత గోసేవ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పుంగనూరు గోమాతతో బాలకృష్ణ గురుస్వామి ఆధ్వర్యంలో 500మంది భక్తులు వచ్చారు. ఈ గోవుతో కశ్మీరు నుంచి కన్యాకుమారి వరకు 182 రోజుల్లో 14 రాష్ట్రాలు కాలినడకన 5,158 కిలోమీటర్లు ప్రయాణించారు. గోమాతకు ఆలయ ఈవో ప్రత్యేక పూజలు చేసి గోమాతతో కలిసి కొండ చుట్టూ రెండున్నర కిలోమీటర్లు 45నిమిషాల్లో ప్రదక్షిణ చేసి కొండెక్కి మొక్కులు తీర్చుకున్నారు. కాగా, ఓ వైపు భక్తిభావాన్ని, మరోవైపు మువ్వెన్నల జెండాతో జాతీయ భావాన్ని భక్తులు చాటుకున్నారు. నృసింహ మాలధారణ దీక్ష ఆదివారంతో ముగియడంతో సోమ వారం ఉదయం ఏడు గంటలకు స్వాములు దీక్ష విరమణ చేయనున్నారు. అదేవిధంగా ఆలయంలో నిర్వహించిన సహస్ర కలశా భిషేకం పూజల్లో ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, కలెక్టర్ ఎం.హనుమంతరావు పాల్గొన్నారు.

సహస్ర కలశాభిషేక పూజలు

స్వామివారి జయంత్యుత్సవాలు ముగింపులో భాగంగా ఆలయంలో స్వామివారి జన్మ నక్షత్రం స్వాతి నక్షత్రం పురస్కరించుకుని సహస్ర కలశాభిషేకాన్ని ఆలయ పూజారులు నిర్వహించారు. సుప్రభాత సేవతో స్వామిఅమ్మవారిని మేల్కొలిపి నిత్యారాధనలు జరిపిన అర్చకులు ఆస్థాన పరంగా ఆరాధనల అనంతరం ఉత్సవమూర్తులకు హారతి నివేదించారు. ముఖమండపంలో 1008 వెండి కలశాలు వాటిపై కొబ్బరికాయలు పేర్చి అందులో పంచా మృతాలు నింపి పంచసూక్త పఠనాలతో హోమం చేపట్టి ఉత్సవ మూర్తులను, అలంకార మూర్తులను అభిషేకించారు. తులసీ దళాలతో సహస్రనామార్చనలు చేపటారు. సహస్ర కలశాభిషేకం నిర్వహించి 108సువర్ణ పుష్పాలతో అర్చించారు.

కొండపైన.. కింద

స్వామివారి జయంత్యుత్సవాలు, స్వాతి నక్షత్ర పూజలు, గిరి ప్రదక్షిణ వేడుకలకు రాష్ట్ర నలుమూలల నుంచి తరలివచ్చిన భక్తులతో ఉదయం నుంచి రాత్రి వరకు ఉభయ క్యూలైన్లు కోలాహలంగా మారాయి. సుమారు 50వేల మంది భక్తులు క్షేత్ర సందర్శనకు తరలిరావడంతో కొండపైన, కింద వాహనాలతో పార్కింగ్ ప్రదేశాలు నిండాయి. కొండపైన కూడా ఆర్టీసీ బస్‌స్టేషన్ ప్రాంగణంలోని పార్కింగ్ ప్రదేశం నిండింది, కొండపైకి వాహనాల అనుమతి లేదని అధికారులు మైకులో ప్రచారం చేయాల్సి వచ్చింది. కొండపైన తిరువీధులు, ఉత్తర ప్రాకార మండపం, ప్రసాద కౌంటర్లు, శివాలయం, బస్‌స్టేషన్ ఆవరణ, కొండ కింద వ్రత మండపాలు, లక్ష్మీపుష్కరిణి, అన్నదాన సత్రం, బస్‌స్టేషన్ ఆవరణ భక్తులతో కిక్కిరిశాయి. కొండపైన వీఐపీ పార్కింగ్ నుంచి తూర్పు రాజగోపురం వద్దకు వృద్ధులు, చిన్నారులు, చిన్నపిల్లల తల్లులను ఎలక్ట్రానిక్ వాహనాలపై తరలించారు. అదేవిధంగా కొండకింద కూడలి వరకు వాహనాల రద్దీ నెలకింది.

జయంత్యుత్సవాలు పరిసమాప్తి

● వైభవంగా సహస్రకలశాభిషేకం ● నృసింహ ఆవిర్భావం

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి జయంత్యుత్సవాలు ఆదివారంతో పరిసమాప్తమయ్యాయి. ఉత్సవాల చివరి రోజు ఆదివారం ఆలయంలో నృసింహ మూలమంత్ర హవనాలు, లక్ష్మీ సూక్త, విష్ణు సహస్ర పారాయణాలు చేసి మహా పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం గర్భాలయానికి అభిముఖంగా స్వామివారి జయంత్యుత్సవాల్లో భాగంగా జన్మ నక్షత్రం స్వాతి నక్షత్రం రోజున ప్రత్యేకంగా సహస్రకలశాభిషేకం ప్రధానార్చకుడు నల్లందీఘల్ లక్ష్మీనరసింహాచార్యులు, కాండూరి వెంకటాచార్యులు బృందం, వేద పండితులు, యాజ్ఞిక బృందం ప్రత్యేక పూజలు చేశారు. మూడు రోజులుగా చేపట్టిన వేద పారాయణాలు, తిరు వేంకటపతి, పరవాసు దేవ, కాళీయమర్దన, శ్రీరామ అలంకార సేవలు, గరుడ, హనుమంత వాహన సేవలు, హవనాలు, సహస్రకలశాభి షేకాలు, నృసింహ మూల మంత్ర హవనాలు వైభవంగా జరిగాయి. కాగా, సాయంత్ర ఏడు గంటలకు ఆలయంలో విశేష తిరువారాధన, వేద స్వస్తి, నృసింహ ఆవిర్భావం, మహా నివేదన, తీర్థ ప్రసాదగోష్ఠితో ఉత్సవాలు పరిసమాప్త మయ్యాయని ప్రధానార్చకులు వివరించారు. వేడుకలకు ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య కుటుంబ సమేతంగా, కలెక్టర్ ఎం.హనుమంతరావు, దేవాదాయ శాఖ డైరెక్టర్, ఆలయ ఈవో ఎస్. వెంకట్రావు, అనువంశిక ధర్మకర్త భాస్కరాయణి నరసింహమూర్తి దంపతులు, డీఈవో దోర్బల భాస్కరశర్మ, ఏఈవోలు ప్రతాప నవీన్ కుమార్‌శర్మ, గజ్వేల్లి రమేష్ బాబు, రఘు, జూశెట్టి కృష్ణ, నాగుల మహేష్‌గౌడ్, రామరావునాయక్, మాచర్ల రాజన్‌బాబు, వాసం వెంకటేశ్వర్లు, శంకర్‌నాయక్, దాసోజు నరేష్, యాస రాకేష్‌రెడ్డి, ముద్దసాని నరేష్, సివిల్ ఈఈ జిల్లెల దయాక ర్‌రెడ్డి, ఏఈ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ కే. శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ పర్యాటక క్షేత్రానికి ప్రపంచ సుందరీమణులు

(5వపేజీ తరువాయి)

ఎస్పీ వివరించారు. అంతేకాకుండా సాగర్ విజయవిహార్, బుద్ధవనంలో మిస్ వరల్డ్ పోటీదారులు సందర్శించే ఈ రెండు ప్రాంతాలను సోమవారం ఉదయం 10 గంటల నుంచి రాత్రి 8గంటల వరకు పోలీసులు తమ ఆధీనంలోకి తీసుకోనున్నారు. సామాన్యులకు ఎవరికి ఆ సమయంలో అనుమతిలేదు. ఇక్కడకు వచ్చే వీవీఐపీలు, వీఐపీలు, ఇతర సిబ్బంద కోసం మూడు రకాల జోన్‌లుగా విభజించి పాస్‌లు ఇవ్వనున్నరు. వీవీఐపీలకు రెడ్ పాస్‌లు, వీఐపీలకు ఆరెంజ్ పాస్‌లు, ఇతర సిబ్బందికి గ్రీన్ పాస్‌లు, మీడియాకు తెలుపు రంగు పాస్‌లు ఇవ్వనున్నట్లు ఎస్పీ తెలిపారు. పాస్‌లను బట్టి ఆయా పరిధి వరకు మాత్రమే వారికి అనుమతి ఉంటుందని తెలిపారు.

సబ్ కలెక్టర్ పర్యవేక్షణ

మిస్ వరల్డ్ పోటీదారులు విశ్రాంతి తీసుకోనున్న విజయ విహార్ అతిథి గృహం, సందర్శించనున్న బుద్ధవనంలను సబ్‌కలెక్టర్ అమిత్ నారాయణ దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. ఆదివారం రాత్రి ఆయన సాగర్ విజయ విహార్‌లోనే ఉండి రెవెన్యూ, పోలీస్, అటవీ శాఖ, అగ్నిమాపక, వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించి, ఎప్పటికప్పుడు సూచనలు చేశారు.

పర్యాటక కేంద్రంగా మారేనా?

(5వపేజీ తరువాయి)

ఫణిగిరి క్షేత్రం ఒకటి. అమరావతి, నాగార్జునకొండ బౌద్ధక్షేత్రాల కంటే ఈ బౌద్ధక్షేత్రం గొప్పదంటారు. నాగార్జున కొండకు ఉప యూనివర్సిటీగా చెబుతారు. ఈ బౌద్ధక్షేత్రం అభివృద్ధి నోచడంలేదు. ఇక్కడకు వచ్చే సందర్శకులకు కనీస మౌలిక వసతులు లేవు. ఇక్కడ ఇక్ష్వాకులు 11 సంవత్సరాలు పరిపాలించినట్లు చారిత్రక ఆధారాలు చెబుతున్నాయి. 1941లో అప్పటి నైజాం ప్రభువు కాలంలో ఈ బౌద్ధ క్షేత్రంలో తొలిసారి తవ్వకాలు జరిపారంటున్నారు. ఆ తర్వాత పురావస్తు శాఖ వారు 2001 నుంచి 2007 వరకు ఫణిగిరి గుట్టపై తవ్వకాలు జరిపారు. ఆ తర్వాత తిరిగి 2015లోనూ తవ్వకాలు జరిపారు. ఈ తవ్వకాల్లో మహాస్థూపం, చైత్యగృహలు, స్థూపాలు, శిలా మండపాలు, బుద్ధుని పాదాలు, బుద్ధుని ప్రతిమలు, పాత్రలు, చిహ్నాలు, జాతక కథలు, సిద్ధార్థ గౌతమి జీవిత కథలు, అపురూపంగా మల్చిన శిల్పాలు, శాతవాహలు, ఇక్ష్వాకులు, మహాతరవరుల నాణాలు, బొమ్మలు బయటపడ్డాయి. కుండలు, కూజలు, కప్పులు, టైల్స్, బౌద్ధుల గదులు బయటపడ్డాయి. ఇందులో 32 గదులు ఉన్నాయి. బుద్ధుని పాదాలు, బుద్ధుని వ్యక్తిత్వానికి ప్రతీకలుగా భావించే అష్టమంగళం, చిహ్నాలు, మర్మచక్రం, మిథునం, అంకుశం, యజ్ఞాశం, ఖడ్గం, సప్తి, పిరస్నం గుర్తులు లభించాయి. ప్రపంచంలో ఎక్కడ లేని బుద్ధుని తలపాగా ఇక్కడ లభ్యమైందని చెబుతారు.

రూ.2కోట్లు కేటాయించినా..

గతంలో ఇక్కడ బుద్ధవనం ప్రాజెక్ట్ అభివృద్ధికి ప్రభుత్వం రూ.2కోట్లు కేటాయించినప్పటికీ, ప్రాజెక్టు రూపుదిద్దుకోలేదు. తరచుగా దేశ, విదేశాల బౌద్ధ మత గురువులు, పురావస్తు పరిశోధకులు, అధ్యయనకారులు ఈ క్షేత్రాన్ని సందర్శిస్తున్నారు. 2024 మార్చి 11న ఈ ఫణిగిరి బౌద్ధక్షేత్రంలో మ్యూజియం ఏర్పాటుచేసి ప్రారంభించారు. ఆకార్యక్రమంలో తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్, పురావస్తుశాఖ ముఖ్య కార్యదర్శి శైలజారామయ్యర్, డైరెక్టర్ భారతీ హోళీకేరీ, కలెక్టర్ వెంకట్రావు పాల్గొన్నారు. ఆ రోజు నుంచి పురావస్తు శాఖ అధికారులు ఇక్కడ మళ్లీ తవ్వకాలు చేపట్టారు. మార్చి 29న 2వేల ఏళ్ల కిందటి 3,700 సీసపు నాణేలు బయటపడ్డాయి. అవి శాతవాహనుల సామంతులైన మహాతలవరుల కాలం నాటి నాణేలుగా భావిస్తున్నారు. క్రీ.శ. రెండో శతాబ్దంలో ఇక్కడ బౌద్ధ ధర్మాన్ని విస్తృతంగా ప్రచారం చేశారని చెబుతారు. బుద్ధపూర్ణిమ సందర్భంగా ఇక్కడ ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఈ కార్యక్రమాల్లో భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, రిటైర్డు ఐఏఎస్ చిరంజీవులుతోపాటు పలువురు పాల్గొంటారని బోధితత్వ ఫౌండేషన్ కార్యవర్గ సభ్యుడు ఎర్ర యాదగిరి తెలిపారు. బుద్ధుని జీవన విధానం, ఆయన బోధనలు వినిపిస్తారు.



తవ్వకాల్లో బయట పడ్డ బౌద్ధుల కాలం నాటి ప్రతిమలు, స్తంభాలు

5 రోజులు 5 అంశాలు

(5వపేజీ తరువాయి)

శిక్షణ తరగతులు నిర్వహించనున్నారు. నల్లగొండ జిల్లాలో 3,173మందిఉపాధ్యాయులకు, యాదాద్రి జిల్లాలో 3,100మందికి, సూర్యాపేట జిల్లాలో 3,150 మందికి శిక్షణ ఇచ్చేందుకు ఏర్పాట్లు చేశారు.

నల్లగొండ జిల్లాలో శిక్షణకు హాజరయ్యే ఉపాధ్యాయుల సంఖ్య

సంఖ్య	సబ్జెక్టు	ఉపాధ్యాయులు
1	జీహెచ్‌ఎం	218
2	ఎస్‌ఏ తెలుగు	368
3	ఎస్‌ఏ హిందీ	284
4	ఎస్‌ఏ ఇంగ్లీష్	389
5	ఎస్‌ఏ మ్యాథ్స్	470
6	ఎస్‌ఏ ఫిజికల్‌సైన్స్	355
7	ఎస్‌ఏ బయోసైన్స్	368
8	ఎస్‌ఏ సోషల్	401
9	ఎస్‌ఏ ఫిజికల్ ఎడ్యూకేషన్	180
10	ఎస్‌ఏ, ఎస్‌జీటీ, ఐఈఆర్పీ	104
11	ప్రైమరీ ఉర్దూ మీడియం	36
	మొత్తం	3173

పలు కేంద్రాల్లో శిక్షణ తరగతులు

మూడు విడతలుగా జరిగే శిక్షణ తరగతులను పలు పాఠశాలల్లో నిర్వహించనున్నారు. నల్లగొండ జిల్లా విషయానికొస్తే జిల్లాకేంద్రంలోని సెయింట్ ఆల్ఫాన్సెస్ హైస్కూల్, ప్రభుత్వ డైట్ కళాశాల, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, ప్రభుత్వ ఉపాధ్యాయ కళాశాలతోపాటు డైట్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఈ శిక్షణ తరగతులు నిర్వహిస్తారు. ఇదేవిధంగా యాదాద్రి భువనగిరి, సూర్యాపేట జిల్లాలో ఎంపిక చేసిన కేంద్రాలల్లో జిల్లాస్థాయిలో ఉపాధ్యాయులకు మొదటి విడత శిక్షణ నిర్వహిస్తారు. స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లీష్, గణిత, సోషల్‌స్టడీస్ ఉపాధ్యాయులకు, మండల స్థాయి రిసోర్స్ పర్సన్‌లకు, జిల్లాలోని ఉర్దూ మీడియం ప్రైమరీ టీచర్లకు, స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్లకు, ఐఈఆర్పీలకు శిక్షణను ఇస్తారు. ఈ శిక్షణ తరగతులకు కోర్సు డైరెక్టర్‌గా జిల్లా విద్యాధికారి, కోర్సు కోఆర్డినేటర్‌గా ప్రభుత్వ డైట్ కళాశాల ప్రిన్సిపాల్, క్వాలిటీ కోఆర్డినేటర్‌గా సమగ్ర శిక్ష అధికారి వ్యవహరిస్తారు. ఈ శిక్షణకు ప్రభుత్వ, లోకల్‌బాడీ, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు, కేజీబీవీ, యూఆర్‌ఎస్, తెలంగాణ మోడల్ స్కూల్‌లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు అంటే జీహెచ్‌ఎం ప్రిన్సిపాల్స్, ప్రత్యేక అధికారులు, స్కూల్ అసిస్టెంట్లు, ఎల్‌పీటీ, హెచ్‌పీటీ, పీఈటీ, పీజీటీ, సీఆర్‌పీలు హాజరు కావాల్సి ఉంటుంది.

శిక్షణ తరగతులు నిర్వహించే అంశాలు

నెలాఖరు వరకు జరిగే శిక్షణ తరగతుల్లో కంటెంట్ ఎన్రీచ్‌మెంట్, డిజటల్ ఎడ్యుకేషన్, ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్, లైఫ్ స్కిల్స్, లెర్నింగ్‌అవుట్ కమ్స్ వంటి విషయాలపై ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తారు. కేటాయించిన తేదీలలో ఈ శిక్షణ తరగతులకు హాజరు కావాల్సి ఉంటుంది. ప్రతీరోజు ఉదయం 9.30 గంటల నుంచి శిక్షణ ప్రా రంభం అవుతుంది. శిక్షణ తరగతులను నిర్వహిస్తున్న విద్యాశాఖ పాఠశాలలను బలోపేతం చేసే కార్యక్రమం కూడా చేపడుతుంది. బడిబాటను నిర్వహించడంతోపాటు వచ్చే విద్యాసంవత్సరానికి ఎన్‌రోల్‌మెంట్ పెంచడానికి తగిన చర్యలు తీసుకోనున్నారు. పదో తరగతి ఫెయిల్ అయిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులను నిర్వహించి ప్రతిఒక్కరూ ఉత్తీర్ణత సాధించేలా చర్యలు తీసుకుంటున్నారు. ఈ వేసవిలో ఏఐఏఎక్స్‌ఎల్ ల్యాబ్‌లను అందుబాటులో ఉంచాలని విద్యాశాఖ సూచించింది.

ప్రతిఒక్కరూ శిక్షణ తరగతులకు హాజరు కావాలి

ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న వేసవి శిక్షణ తరగతులకు ప్రతీ ఒక్క ఉపాధ్యాయుడు హాజరు కావాలి. ఒక్కో విడతలో ఐదు రోజులపాటు శిక్షణ తరగతులను నిర్వహించడం జరుగుతుంది. మూడు విడతల్లో ఈ శిక్షణ తరగతులు పూర్తవుతాయి. ఈ నెలాఖరు వరకు శిక్షణ తరగతులు నిర్వహించనున్నాం. ఉపాధ్యాయులు ప్రతీరోజు ఉదయం 9.30గంటలకు హాజరుకావాలి. ఐదు అంశాలపై శిక్షణ తరగతులను నిర్వహించడం జరుగుతుంది. ముఖ్యమైన శిక్షణ తరగతులైనందున ఉపాధ్యాయులు శిక్షణ తరగతులు హాజరుకావాలి. ఎవరికి మినహాయింపు లేదు.

- బొల్లారం భిక్షపతి, డీఈవో నల్లగొండ

నేడు శేషు స్మారక సదస్సు

నల్లగొండ, మే 11 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి నల్లగొండ జిల్లా ఉపాధ్యాయ ఉద్యమ నిర్మాత శేషు స్మారక సదస్సు సోమవారం నల్లగొండ పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో నిర్వహిస్తున్నట్లు డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు బి. వెంకటేశం, జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సదస్సుకు ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నలుగురు జూదరుల అరెస్టు

కట్టంగూరు, మే 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్మెర గ్రామ శివారులో పేకాట ఆడుతున్న నలుగురిని పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. ఏఎస్ఐ ఆఫ్జల్ అలీ తెలిపిన వివరాల ప్రకారం... కల్మెర గ్రామ శివారులో డబ్బులు పందెంగా పెట్టి పేకాట ఆడుతున్నారని పక్కా సమాచారం రావడంతో సిబ్బందితో వెళ్లి నలుగురిని పట్టుకుని వారి నుంచి రూ.2520, మూడు ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పట్టుబడిన వారిపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ తెలిపారు.

నీళ్లు మళ్లించొద్దని రైతుల ఆందోళన

● నేరడకు వచ్చే నీటికి కాల్వ తవ్వారని ఆరోపణ ● నీటిని అక్రమంగా తరలించడం తగదని హితవు



నేరడలో ఆందోళన చేస్తున్న రైతులు

చిట్యాలరూరల్, మే 11(ఆంధ్రజ్యోతి): బ్రాహ్మణవెల్లంల ఉదయసముద్రం నీటిని తమ గ్రామం నుంచి ఇతర గ్రామాలకు అక్రమంగా మళ్లించొద్దని చిట్యాల మండలం నేరడ గ్రామానికి చెందిన రైతులు ఆదివారం ఆందోళన చేశారు. ఉదయసముద్రం కాల్వ నుంచి నేరడకు వచ్చే నీటిని నల్లగొండ మండలం అప్పాజిపేటకు చెందిన గుర్తుతెలియని వ్యక్తులు అక్రమంగా కాల్వ తవ్వారని ఆరోపించారు. తమ గ్రామానికి వచ్చే నీటిని అక్రమంగా తరలించడం ఏమిటని ప్రశ్నించారు. ఉదయసముద్రం కాల్వ కోసం తమ గ్రామ రైతులు వందల ఎకరాలు ఇచ్చారని, ఇప్పటి వరకు నష్టపరిహారం అందలేదని అయినా తాము మిన్నకుండిపోయామన్నారు. సుమారు 700 మీటర్ల వరకు కాల్వ పనులు పూర్తయితే తమ గ్రామానికి పూర్తిస్థాయిలో నీటిని వినియోగించుకోవచ్చన్నారు.



చిట్యాల మండలం నేరడ శివారులో పారుతున్న ఉదయసముద్రం నీరు

అధికారితో వాగ్వాదం

గ్రామ శివారులో కాల్వ వద్దకు వచ్చిన ఉదయసముద్రం అధికారి డీఈ పిచ్చయ్య అక్కడికి రావడంతో రైతులు తమ పరిస్థితి ఏమిటని నీటిని అక్రమంగా ఎలా తరలిస్తారని ప్రశ్నించారు. మీ గ్రామానికి నీటిని ఇవ్వబోమని అధికారి చెప్పడంతో రైతులు ఆగ్రహించారు. కాల్వలు అక్రమంగా తవ్వితే ఇతరులకు ప్రశ్నించకుండా తమపై ఆగ్రహిస్తారా అని, సెలవు రోజు ఆదివారం రావడమేంటని నీటి గురించి అక్రమంగా తరలింపు గురించి అడిగితే తమను హేళన చేసి నీరు ఇవ్వకపోవడం ఏమిటని అధికారితో రైతులు వాగ్విదానికి దిగారు. కాల్వ నుంచి తమ గ్రామానికి వచ్చే నీటిని ఆపేయడమేంటని నేరడకు వచ్చే కాలువ ద్వారా నీటిని ఆపి అప్పజిపేటకు తరలించడం సరికాదన్నారు. నేరడకు వచ్చే ఉదయసముద్రం నీరు తమ గ్రామంలోని చెరువు నిండాక నీటిని ఇతర ప్రాంతానికి తరలించుకున్నా తమకు అభ్యంతరం లేదని చెరువు నిండముందే నీటిని మధ్యలోనే తరలించడమేటని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. తమ గ్రామం నుంచి గుర్తుతెలియని వ్యక్తులు తమకు తెలియకుండా మరో కాల్వలకు రైతులకు సమాచారమందించకుండా వారి భూముల నుంచి కాల్వలు తవ్వడం సరికాదన్నారు. ఉదయసముద్రం నీరు నేరడ గ్రామం చెరువు నిండాక ఏ గ్రామానికైనా మళ్లించుకోవాలని, ఇందుకు తమకు ఎలాంటి అభ్యంతరం లేదన్నారు. న్యాయం జరగాలని అందుకు ప్రజాప్రతినిధులు అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు విజ్ఞప్తి చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు రైతులను శాంతిపజేశారు.



నేరడ శివారులో ఇతర గ్రామ రైతులు తవ్విన కాలువను పూడ్చిన నేరడ రైతులు

అమర వీరుల చరిత్ర నేటితరానికి తెలియాలి



వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

నల్లగొండ టౌన్, మే 11(ఆంధ్రజ్యోతి): సమాజం కోసం పోరాటాలు చేసి ప్రాణాలర్పించిన వీరుల చరిత్ర నేటి తరానికి తెలియజేయాలని దొడ్డి కొమరయ్య సినిమా నిర్మాణ కమిటీ గౌరవ అధ్యక్షుడు కంది సూర్య నారాయణ అన్నారు. జిల్లాకేంద్రంలోని అమరవీరుల స్థూపం వద్ద తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమరయ్య సినిమా వాల్ పోస్టర్‌ను ఆదివారం ఆవిష్కరించారు. అనంతరం టీఎన్జీవోస్ భవనంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. సబ్బండవర్గాల ప్రజలు కలిసి ఈ సినిమా నిర్మించడం ద్వారా తెలంగాణ కళాకారులకు అవకాశం కల్పిస్తున్నామన్నారు. గౌరవ సలహాదారులు నెలపట్ల సత్యానారాయణ మాట్లాడుతూ తెలుగు చిత్ర పరిశ్రమలో తెలంగాణ వాళ్లకు చోటు లేకపోవడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో నిర్మాణ కమిటీ చైర్మన్ నెలపట్ల రమేష్, చీర పంకజ్‌యాదవ్, కాసోజు విశ్వనాథం, దుడుకు లక్ష్మీనారాయణ, చిక్కుల రాములు, నగర కంటి కాశయ్యగౌడ్, విజయ్, సీతారాములు, కర్ని ఆనంద్ కుమార్, వాడపల్లి సాయిబాబా, మల్లికార్జున్‌గౌడ్, నాగులపల్లి శ్యాంసుందర్, దామోదర్, ఆలగడప గిరిధర్, యేకుల రాజారావు, కృష్ణ, కొండ లలిత పాల్గొన్నారు.

శాపల్లి దేవస్థానంలో గిరిప్రదక్షిణ ప్రారంభం



గిరిప్రదక్షిణలో పాల్గొన్న గ్రామస్థులు

నార్కట్‌పల్లి, మే 11 (ఆంధ్రజ్యోతి): నృసింహ జయంతిని పురస్కరించుకుని మండలంలోని శాపల్లి కమలాద్రి లక్ష్మీనరసింహ్మా స్వామి దేవస్థానంలో ఆదివారం గిరిప్రదక్షిణం ప్రారంభించారు. యాదాద్రి దేవస్థాన విశ్రాంత ముఖ్య అర్చకుడు శాపల్లి దేవస్థాన అనువంశిక అర్చకుడు కారంపూడి నర్సింహ్మాచారి ప్రత్యేక పూజలనంతరం ఆలయం వద్ద ఉన్న హనుమాన్ విగ్రహం నుంచి గిరిప్రదక్షిణం కార్యక్రమాన్ని ప్రారంభించారు. సుమారు రెండు కిలోమీటర్ల దూరం ఉన్న మట్టిరోడ్డుపై తొలిరోజు గ్రామానికి చెందిన భక్తులు నర్సింహ్మాచార్యులు ఇతర అర్చకులతో కలిసి గిరిప్రదక్షిణ చేశారు. ప్రతీ మాసం పౌర్ణమి తిథిన గిరిప్రదక్షిణం చేస్తే మానసిక, గ్రహదోషాలు తొలగిపోతాయని నర్సింహ్మాచార్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కర్నాటి ఉపేందర్, నిమ్మనగోటి వెంకన్న, కర్నాటి నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

శాలిగౌరారం, మే 11(ఆంధ్రజ్యోతి): స్థానిక విజ్ఞాన జ్యోతి హై స్కూల్‌లో 2004-2005 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు 20 సంవత్సరాల తర్వాత ఆదివారం శాలిగౌరారంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో కలుసుకున్నారు. చాలా కాలం తర్వాత కలుసుకున్నవారు యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులు బుడిగె శ్రీనివాస్, కొయ్యడ శివశంకర్, పడాల అంతయ్య, కొడవటికంటి సుబ్రహ్మణ్యం శర్మ, మద్ది శశిధర్‌రెడ్డి, రావుల వీరయ్య, చెవుగోని సత్యనారాయణ సన్మానించారు. అనంతరం అందరూ కలిసి సహపంక్తి భోజనాలు చేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు కనుక రామకృష్ణ, కర్రె సైదులు, పడాల లింగస్వామి, నిమ్మల శంకర్, పోతుగంటి సైదులు, ఎస్. నరేష్, పి. ఉమా, ఎం. ఉమా, కవిత, దివ్య భారతి, రేణుక, భార్గవి తదితరులు పాల్గొన్నారు.

ప్రజావ్యతిరేక విధానాలపై పోరాడాలి

మునుగోడు రూరల్, మే 11 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బొల్గురి నరసింహ పిలుపునిచ్చారు. మండలంలోని పులి పల్పుల గ్రామంలో శనివారం రాత్రి జరిగిన సమావేశంలో మాట్లాడారు. అర్హులైన వారికి ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలన్నారు. రేషన్‌కార్డు పేరుతో అర్హులైన వారి పేర్లు కూడా తొలగిస్తున్నారన్నారు. ఈ సమావేశంలో సీపీఐ మండల కార్యదర్శి చాపల శీను, నాయకులు కాయిత వెంకన్న, బొలుగురు ఎల్లయ్య, గుండెబోయిన భాస్కర్, సింగం యాదయ్య, పందుల యాదయ్య, మలికంటి వినీల్, మునుగోటి సత్యనారాయణ, జనగాం శంకరయ్య, దొటి రమేష్, సిలువేరు సైదులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి గుత్తా అమిత్‌రెడ్డి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న గుత్తా అమిత్‌రెడ్డి

చిట్యాలరూరల్, మే 11 (ఆంధ్రజ్యోతి): చిట్యాల మండలం ఉరుమడ్ల గ్రామానికి చెందిన జన్నపాల శ్రీను సోదరి కూతురు కత్తుల అలివేలుకు డెయిరీ డెవలప్‌మెంట్ చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి ఆర్థిక సహాయం అందజేశారు. మొయినాబాద్‌లోని భాస్కర్ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ 4వ సంవత్సరం చదువుతున్న అలివేలు విద్యాసంవత్సరం ఖర్చుల నిమిత్తం గుత్తా వెంకట్‌రెడ్డి మెమోరియల్ ట్రస్టు ద్వారా చైర్మన్ అయిన డెయిరీ డెవలప్‌మెంట్ చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి హైదరాబాద్‌లోని తన నివాసంలో రూ. 50 వేల ఆర్థిక సహాయం అందజేశారు. భవిష్యత్‌లో ఉన్నత విద్యనభ్యసించి పేదలకు వైద్యసేవలందించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జన్నపాల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఎప్‌సెట్ ఫలితాల్లో 'ఆల్ఫా' విద్యార్థుల ప్రతిభ



కందుల వైష్ణవి



ఆంగోతు అనూష

నల్లగొండ టౌన్, మే 11 (ఆంధ్రజ్యోతి): ఎప్‌సెట్ ఫలితాల్లో పట్టణంలోని ఆల్ఫా కళా శాల విద్యార్థులు సత్తా చాటారు. ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ ఫలితాల్లో మరోసారి ప్రతిభ చాటారు. కళాశాలకు చెందిన కందుల వైష్ణవి 6523 సాధించగా మరో విద్యార్థిని ఆంగోతు అనూష 10848 ర్యాంకు సాధించి సత్తా చాటారు. ఈ సందర్భంగా ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను కళాశాల అధ్యాపకులు యాదగిరి రాజు, శ్రీనివాస్, రమేష్, లింగ స్వామి, శ్రీరాములు, శ్రీకాంత్, ప్రేమ్‌సాగర్ తదితరులు అభినందించారు.

సమ్మెను విజయవంతం చేయాలి



గట్టుప్పల్‌లో పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

గట్టుప్పల్, మే 11(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, కర్షక ప్రజా వ్యతిరేక విధానాలపై ఈ నెల 20న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు కార్మిక వర్గం, రైతాంగం సిద్ధం కావాలని రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు బండ శ్రీశైలం పిలుపునిచ్చారు. ఈ నెల 20న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె పోస్టర్‌ను గట్టుప్పల్ మండల కేంద్రంలో ఆదివారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం సీనియర్ నాయకులు ఎండీ రబ్బాని, పెద్దగాని నరసింహ, కర్నాటి యాదయ్య, దుబ్బాక సాయిలు, ఖమ్మం పెద్ద యాదయ్య, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

చిట్యాల: కార్మికులను బానిసలుగా మార్చే లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు జిట్ట నగేష్ డిమాండ్ చేశారు. ఈ నెల 20న దేశవ్యాప్తంగా నిర్వహించే సార్వత్రిక సమ్మెను విజయవంతం కోరుతూ ఆదివారం చిట్యాలలో రైస్‌మిల్ కార్మికులు, లారీ డ్రైవర్లతో కలిసి సమ్మె ప్రచార పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులు పోరాడి సాధించుకున్న ఎనిమిది గంటల పనివిధానం మార్చడానికి కేంద్రప్రభుత్వం ప్రయత్నిస్తోందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో లారీ డ్రైవర్స్ యూనియన్ అధ్యక్షుడు ఎస్‌డీ. అజీజ్, కార్యదర్శి కొండ్రెడ్డి నర్సింహ్మా, అవిశెట్టి కృష్ణ, గునగంటి కృష్ణయ్య, పుల్లెంల యాదయ్య, పండుగ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆరు గ్యారెంటీలు అమలు చేయాలి



చిట్యాలలో సీపీఐ మండల మహాసభల కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

చిట్యాల, మే 11,(ఆంధ్రజ్యోతి): ఎన్నికలకు ముందు ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీల హామీలను అమలు చేయాలని సీపీఐ జిల్లా కమిటీ సభ్యుడు బొడిగె సైదులు డిమాండ్ చేశారు. ఈ నెల 16న మండలంలోని గుండ్రాంపల్లిలో నిర్వహించే సీపీఐ మండల మహాసభ ప్రచార పోస్టర్‌లను ఆదివారం మండలకేంద్రంలో ఆవిష్కరించారు. ప్రజా సమస్యల పరిష్కారమే కమ్యూనిస్టుల ఎజెండా అన్నారు. కార్యక్రమంలో జిల్లా సత్యం, దేశగోని బాలరాజు, గుండాల సత్తయ్య, బొల్గూరి లింగయ్య, రావుల చినవెంకన్న, పానుగుల శివ తదితరులు పాల్గొన్నారు.

మునుగోడు రూరల్: అర్హులైన నిరుపేదలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు గురజ రామచంద్రం డిమాండ్ చేశారు. మండలంలోని పలివెల గ్రామంలో శనివారం రాత్రి జరిగిన పార్టీ గ్రామ శాఖ మహాసభలో మాట్లాడారు. ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాల అమలు కోసం సీపీఐ పోరాడుతుందన్నారు. నిరుపేదలను గుర్తించి ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, పింఛన్లు అందించాలన్నారు. ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి తీర్పారి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో యువత గంజాయి కొకైన్ లాంటి మత్తు మత్తుకు బానిస అవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సమావేశంలో నాయకులు నాతి నరసింహ, మాజీ జడ్పీటీసీ గోస్కొండ లింగయ్య, మాజీ ఎంపీపీ మాధగోని సాయిలు, గోల్కొండ, కృష్ణయ్య, ఆనగంటి నరసింహ, వరికుప్పల వెంకన్న, మాధగోని మల్లయ్య పాల్గొన్నారు.

యూకలిప్టస్ చెట్లు దగ్ధం



దగ్ధమైన యూకలిప్టస్ చెట్లు

చిట్యాలరూరల్, మే 11 (ఆంధ్రజ్యోతి): మండలం నేరడలో యూకలిప్టస్ చెట్లు అగ్నికి ఆహుతయ్యాయి. గ్రామానికి చెందిన దుబ్బాక మహేందర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డిలకు చెందిన 16 ఎకరాల వ్యవసాయ భూమిలో యూకలిప్టస్ చెట్లను పెంచుతున్నారు. శనివారం సాయంత్రం చెట్లలో మంటలు వ్యాపించి దగ్ధమ య్యాయి. మంటలు అంటుకోవడంతో సమీపంలోని రైతులు వచ్చి నీరు చల్లి మంటలు ఆర్పారు. మంటలు అంటుకొని 16 ఎకరాల్లోని యూకలిప్టస్ చెట్లు పూర్తిగా దగ్ధమయ్యాయి. దీంతో తమకు పెద్దఎత్తున నష్టం జరిగిందని బాధిత రైతులు దుబ్బాక మహేందర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి తెలిపారు.

ఉద్యమాల పుట్టినిల్లు నల్లగొండ

నల్లగొండ కల్చరల్, మే 11 (ఆంధ్రజ్యోతి): తెలుగు సాహిత్యంలో అస్తిత్వ ఉద్యమాలకు నల్లగొండ కేంద్ర బిందువుగా నిలిచిందని సాహితీ వేత్త మునాస వెంకట్ అన్నారు. కవి శీలం భద్రయ్య రచించిన 'ముస్తాదు' కవితా సంపుటిని ఆదివారం నల్లగొండలోని యూటీఎఫ్ భవనలో ఆవిష్కరించారు. శీలం భద్రయ్య చక్కని భావనా శక్తితో శిల్పి సౌందర్యం కలిగిన కవితలు రాసారని అన్నారు. సృజన సాహితీ సంస్థ అధ్యక్షుడు పెరమాళ్ల ఆనంద్ అధ్యక్షతన జరిగిన ఈసమావేశంలో సాహితీ వేత్తలు, రచయితలు, కవులు నరహరి, డాక్టర్ తండు కృష్ణ కౌండిన్య, సాగర్ల సత్తయ్య, శంకర్, మాదగాని శంకర్, కిషోర్‌కుమార్, అరుణజ్యోతి, రామకృష్ణ, యాదగిరి, రమేష్, గణేష్, శ్రీరాములు, భీమార్జున్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ కళాశాల ప్రారంభానికి సన్నాహాలు

● అడ్మిషన్ల కోసం గ్రామాల్లో ప్రచారం



అడ్మిషన్ బ్యానర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్‌గౌడ్

కనగల్, మే 11: (ఆంధ్రజ్యోతి) కనగల్ మండలానికి మంజూరైన నూతన ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఈఈ విద్యా సంవత్సరం నుంచి ప్రారంభించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆదేశాల మేరకు మాజీ జడ్పీటీసీ నర్సింగ్ శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో కళాశాల అధ్యాపకులు కనగల్ ఎక్స్‌రోడ్డు లోని పోలీస్ క్వాటర్స్‌తో పాటు, ఓ ప్రైవేట్ విద్యాసంస్థ భవనాన్ని పరిశీలించారు. వీటిలో ఏదో ఒకచోట ఈ ఏడాది కళాశాలను కొనసాగిస్తారు. ఎస్ఎల్‌బీసీ స్థలంలో కళాశాల కొత్త భవన నిర్మాణం కోసం ప్రభుత్వం నిధులు మంజూరు చేసినా పనులు ఇంకా ప్రారంభం కాలేదు. సొంత భవనం ఏర్పాటు కాకపోవడంతో తాత్కాలికంగా ఎంపిక చేసిన చోట కళాశాలను ప్రారంభించనున్నారు. వారం పది రోజులుగా కళావాల తరుపున అధ్యాపక బృందం విద్యార్థుల నుంచి అడ్మిషన్ల కోసం గ్రామాల్లో పర్యటిస్తున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ కనగల్‌తో పాటు చండూరు, గుర్రంపోడు మండలాలకు చెందిన గ్రామీణ విద్యార్థులకు కళాశాల అందుబాటులో ఉంటుందని తెలిపారు. ప్రతీక్ ఫౌండేషన్ ద్వారా కళాశాలలో అన్ని రకాల వసతులు ఏర్పాటు చేస్తారని తెలిపారు. ఒకేషనల్ కోర్సులు కూడా ప్రవేశ పెడతారని వివరించారు.


స్విమ్మర్లకు వైద్య పరీక్షలు

నల్లగొండ స్పోర్ట్స్, మే 11 (ఆంధ్రజ్యోతి): జిల్లా క్రీడా ప్రాధికారిక సంస్థ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఇండోర్ స్టేడియంలోని స్విమ్మింగ్ పూల్‌లో ఈతకు వెళ్తున్న వారి కోసం ఆదివారం ప్రత్యేకంగా మెడికల్ క్యాంపును నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ గోవర్ధన్‌రెడ్డి బాల, బాలికలకు వైద్యపరీక్షలు నిర్వహించారు. జలుబు, దగ్గు, చర్మవ్యాధుల వంటివాటిని పరీక్షించి మందులు ఇచ్చారు. ఈత కొట్టే సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రతలను సూచించారు. ఈ కార్యక్రమంలో డీవైఎస్‌వో కుంభం నర్సిరెడ్డి, ఉద్యోగి ఎండీ. నజీరుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

దామాషా ప్రకారం వాటా కల్పించాలి

నల్లగొండ టౌన్, మే 11 (ఆంధ్రజ్యోతి): విద్యా, వైద్య, రాజకీయ, ఆర్థిక రంగాల్లో యాదవుల జనాభా దామాషా ప్రకారం వాటా కల్పించాలని విద్యావంతుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు చలకాని వెంకట్‌యాదవ్ అన్నారు. యాదవ విద్యావంతుల వేదిక ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షుడు బెల్లి నాగ రాజు యాదవ్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక యాదవ సంఘం భవన్‌లో యాదవులకు రాజకీయ అవగాహన తరగతులు నిర్వహించారు. దేశంలో, రాష్ట్రంలో అగ్రకులాలు, అగ్రవర్ణాలు యాదవులకు తగిన ప్రాధాన్యం ఇవ్వకుండా అణగదొక్కుతున్నాయన్నారు. అనంతరం నల్లగొండ డివిజన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో యాదవ విద్యావంతుల వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి నడ్డి బాలరాజు యాదవ్, పిల్లి రామ రాజు, చీర పంకజ్‌యాదవ్ బొబ్బల గోపాలకృష్ణ యాదవ్, డాక్టర్ దూది మెట్ల శ్రీనివాస్ యాదవ్, ఎల్వీయాదవ్, అల్లి వేణుయాదవ్, సుభాష్ యాదవ్, దుడుకు లక్ష్మీనారాయణ, రేణుక తదితరులు పాల్గొన్నారు.

నర్సమ్మ మృతి బాధాకరం : గుత్తా



నాంపల్లి, మే 11(ఆంధ్రజ్యోతి): నాంపల్లి మాజీ జడ్పీటీసీ ఎలుగోటి వెంకటేశ్వర్‌రెడ్డి తల్లి నర్సమ్మ దశదినకర్మకు శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి పాల్గొని ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నర్సమ్మ మృతి బాధాకరమన్నారు. నివాళులర్పించిన వారిలో భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్‌రెడ్డి, మాజీమంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంతకండ్ల జగదీష్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, గాదరి కిషోర్, నల్లగొండ మునిసిపల్ మాజీ చైర్మన్ సైదిరెడ్డి, నాయకులు పాల్వాయి స్రవంతి, ఏడుదొడ్ల రవీందర్‌రెడ్డి, వేనేపెల్లి వెంకటేశ్వర్‌రావు, కర్నాటి విద్యాసాగర్, మాజీ ఎంపీపీ నాగమణి తదితరులు పాల్గొన్నారు.

ఎల్లమ్మ ఆలయానికి భక్తుల రద్దీ

కనగల్, మే 11: (ఆంధ్రజ్యోతి): మండలంలోని దర్వేశిపురం స్టేజీ వద్ద గల రేణుకా ఎల్లమ్మ ఆలయానికి ఆదివారం భక్తుల రద్దీ కొనసాగింది. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు ఆలయ ప్రది క్షణలు చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయంలో కుంకుమ అభిషేక పూజలు మొక్కుబడి కల్యాణాలు జరిపించి చీరసారె ఒడి బియ్యం బోననైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కాగా భక్తుల రద్దీకి అనుగుణంగా ఆలయ కమిటీ చైర్మన్ చీదేటివెంకట్‌రెడ్డి, ఈవో జయరామయ్య ఆధ్వర్యంలో సిబ్బంది ఏర్పాట్లు చేశారు.




మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి విరాళం

నార్కట్‌పల్లి, మే 11 (ఆంధ్రజ్యోతి): నార్కట్‌పల్లి పట్టణంలో నూతనంగా నిర్మాణంలో ఉన్న గ్రామ దేవతల ఆలయాల నిర్మాణం కోసం నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య రూ.లక్షవిరాళంగా అందజేశారు. గ్రామ దేవతల ఆలయాల నిర్మాణ కమిటీ సభ్యులు ఆదివారం మాజీ ఎమ్మెల్యే చిరుమర్తిని నార్కట్‌పల్లిలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఆలయాల నిర్మాణం కోసం నిధులు అవసరమున్నందున విరాళం ఇవ్వాలని కోరగా స్పందిం చిన చిరుమర్తి రూ.లక్ష విరాళాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో సామ కొండల్‌రెడ్డి, మిర్యాల రాములు, జెనిగ బిక్షం, కొప్పు శ్రవణ్, దుబ్బాక శ్రీధర్, కమ్మంపాటి రాములు, పుల్లెంల లింగయ్య, కృష్ణ, ఐతరాజు రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

చర్యలు తీసుకోవాలి

నల్లగొండ రూరల్, మే 11 (ఆంధ్రజ్యోతి): కిడ్నాప్ చేశారని నెపంతో పోలీసులు యువకుడిని చితక బాదరని సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి ఆరోపించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందు తున్న కుంచం నవీన్‌ను ఆదివారం పరామర్శించారు. నవీన్, యువతి ప్రేమించుకుంటున్నారని, చట్టపరంగా వారు పెళ్లి చేసుకునే హక్కు ఉందని అన్నారు. పోలీసులు అత్యుత్సాహం చూపి కుంచం నవిన్‌ను విచక్షణా రహితంగా కొట్టారని ఆరోపించారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య, అవుతా సైదులు ఉన్నారు.



హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	: 18004251442
యాదాద్రి	: 1800 425 7106
సూర్యాపేట	: 1800 425 1972

చికెన్ ధరలు


గుడ్డు డజన్ ధర : 66

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.170	260	290
సూర్యాపేట	రూ.174	260	290
నల్లగొండ	రూ.165	245	270

ఉష్ణోగ్రత గరిష్ఠం 39.0 । కనిష్ఠం 24.2

పర్యాటక కేంద్రంగా మారేనా?

» ఫణిగిరి బౌద్ధక్షేత్రంలో చూడదగినవెన్నో.. » నేడు బుద్ధ పూర్ణిమ



ఫణిగిరి బౌద్ధక్షేత్రం

సూర్యాపేట జిల్లా నాగారం మండలం ఫణిగిరి బౌద్ధక్షేత్రాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చి దిద్దుతామని ఎన్నికలప్పుడు రాజకీయ నాయకులు ఇస్తున్న హామీలు గాలిలో కలిసిపోయాయి. ఫలితంగా ఫణిగిరి బౌద్ధక్షేత్రం పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉంది. నేడు బుద్ధ పూర్ణిమ సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' అందిస్తున్న ప్రత్యేక కథనం...

- (ఆంధ్రజ్యోతి-మోత్కూరు)

నాగారం మండల కేంద్రంలోని ఫణిగిరి కొండపై సుమారు 16 ఎకరాల విస్తీర్ణంలో ఈ బౌద్ధక్షేత్రం విస్తరించి ఉంది. ఫణిగిరి అంటే పాము పడగ కొండ అనుకుంటారు గాని ఫణి అంటే జ్ఞానమని, జ్ఞానం కలిగిన కొండ బౌద్ధులు చెబుతారు. ప్రపంచంలో ప్రసిద్ధిగాంచిన బౌద్ధక్షేత్రాల్లో...

- మిగతా 7వ పేజీలో...

పర్యాటక క్షేత్రానికి
ప్రపంచ సుందరీమణులు

» నేడు బుద్ధవనంలో 2,569వ బుద్ధ జయంతి ఉత్సవాలు
» హాజరుకానున్న మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు



విద్యుద్దీపాల వెలుగులో బుద్ధవనం

ప్రపంచ పర్యాటక క్షేత్రానికి ప్రపంచ సుందీరమణులు రానున్నారు. వారి పర్యటన కోసం సాగర్‌లో పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న మిస్‌వరల్డ్ పోటీల్లో పాల్గొనేందుకు ప్రపంచ దేశాలనుంచి వచ్చిన ముద్దుగుమ్మలు సోమవారం సాగర్‌లో పర్యటించనున్నారు. బుద్ధవనంలో నేడు జరిగే బుద్ధ జయంతి వేడుకల్లో వారు పాల్గొంటారు. వారితోపాటు జిల్లాలోని మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు హాజరవుతారు. నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్‌చంద్రపవార్, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్‌లు ఏర్పాట్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు.

- (ఆంధ్రజ్యోతి-నాగార్జునసాగర్)

అంతర్జాతీయ బౌద్ధ క్షేత్రం.. ప్రపంచ పర్యాటక కేంద్రమైన నాగార్జునసాగర్‌లోని బుద్ధవనంలో సోమవారం 2,569వ బుద్ధజయంతి(బుద్ధపూర్ణిమ) ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నారు. ఈసారి బుద్ధ జయంతి ఉత్సవాలు ప్రత్యేకంగా జరపనున్నారు. రాష్ట్ర పర్యాటక శాఖ ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ప్రపంచ సుందరీమణుల పోటీదారులతోపాటు జిల్లా మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉమ్మడి జిల్లాకు చెందిన 10 మంది ఎమ్మెల్యేలు, ఇద్దరు ఎమ్మెల్సీలు హాజరవుతున్నారు. ఈ కార్యక్రమం సాయంత్రం 5గంటలకు ప్రారంభమై 7:45 గంటలకు ముగియనున్నట్లు అధికారులు తెలిపారు. మిస్ వరల్డ్ పోటీల్లో పాల్గొనే ఆసియా దేశాలకు చెందిన 30 మంది పోటీదారులు బుద్ధజయంతి ఉత్సవాల్లో పాల్గొనున్నరు. కార్యక్రమానికి ఎస్పీ శరత్‌చంద్ర పవార్ ఆధ్వర్యంలో పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. బందోబస్తులో 2000 మంది పోలీస్ సిబ్బంది పాల్గొననున్నట్లు ...

- మిగతా 7వ పేజీలో...



భూములను

భూముల రికార్డులు
ఇక పదిలం

» భూ రికార్డుల ప్రక్షాళనే లక్ష్యంగా ముందుకు
» 'భూభారతి'తో సమస్యల పరిష్కారంపై దృష్టి
» పైలట్ మండలాల్లో జోరుగా దరఖాస్తుల స్వీకరణ
» 30వరకు పరిశీలన

ప్రభుత్వం రెవెన్యూ శాఖలో సంస్కరణలను తీసుకొచ్చింది. గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన ధరణిలో లోపాలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ధరణితో రైతులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్న దృష్ట్యా, భూముల క్రయవిక్రయాలు, రికార్డులు పారదర్శకంగా ఉండేందుకు ప్రభుత్వం తగిన చర్యలు చేపడుతోంది.

- (ఆంధ్రజ్యోతి-యాదాద్రి)

గ్రామాల్లో భూ సమస్యల ప్రక్షాళనకు ప్రభుత్వం రంగం సిద్ధం చేస్తోంది. ఇందులో భాగంగా గ్రామానికో రెవెన్యూ అధికారిని నియమించనుంది. భూ సమస్యలపై క్షేత్రస్థాయిలో పరిశీలించి.., ఎప్పటికప్పుడు పరిష్కరించే దిశగా 'భూభారతి'లో ఈ నిబంధన తీసుకొచ్చింది. ప్రభుత్వం మొదటగా నాలుగు జిల్లాల్లోని ఒక్కో మండలంలో పైలట్ ప్రాజెక్టుగా చేపట్టింది. అనంతరం అన్ని మండలాల్లోనూ 'భూభారతి'పై విస్తృత ప్రచారాన్ని చేపట్టింది. జిల్లాలో మొత్తం 17 మండలాల్లో ఏప్రిల్ 21 నుంచి 30వ తేదీవరకు రోజువారీగా అవగాహన సదస్సులు నిర్వహించింది. అయితే ప్రభుత్వం ఇటీవల అన్ని జిల్లాల్లోనూ ఒక మండలాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసింది. ఇందులో భాగంగా యాదాద్రి భువనగిరి జిల్లాలోని ఆత్మకూరు(ఎం) మండలాన్ని పైలెట్ మండలంగా ఎంపిక చేసింది. సూర్యాపేట జిల్లాలోని గరిడేపల్లి మండలాన్ని, నల్లగొండ జిల్లాలోని నకిరేకల్ మండలాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసింది. ప్రస్తుతం జిల్లా రెవెన్యూ యంత్రాంగం ఆత్మకూరు(ఎం) మండలంలో గ్రామగ్రామాన 'భూభారతి'పై అవగాహన కల్పిస్తూ, భూసమస్యలపై రైతులు, ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్నారు. అయితే పలు గ్రామాల్లో ఏళ్ల తరబడి పరిష్కారం కాని భూ సమస్యలపై అధికారులకు దరఖాస్తు చేసుకుంటున్నారు. రెవెన్యూ అధికారులు ప్రజల నుంచి ప్రతీ దరఖాస్తును స్వీకరిస్తున్నారు. ఈ సమస్యలను ఎలా పరిష్కరించాలన్న అంశంపై ప్రజలకు వివరించనున్నారు. పైలెట్ మండలాల్లోని గ్రామాల్లో ఈ నెల 15వ తేదీ వరకు గ్రామసభలు, సమావేశాలు పూర్తిచేసి, ఫిర్యాదులను స్వీకరించనున్నారు.

జూన్ నుంచి అన్ని మండలాల్లోనూ..

ప్రభుత్వం జూన్ నెల నుంచి అన్ని మండలాల్లోనూ భూభారతి చట్టం అమలుపై నిర్ణయం తీసుకోనుంది. పైలెట్ మండలాల్లో రెవెన్యూ సమస్యలు పరిష్కారమవుతోన్న నేపథ్యంలో అన్ని రెవెన్యూ గ్రామాల్లోనూ ప్రజల నుంచి భూ సమస్యలపై దరఖాస్తులు స్వీకరించనున్నారు. ఈ మేరకు మండలాలవారీగా గ్రామసభలపై త్వరలోనే షెడ్యూల్ రూపొందించేందుకు జిల్లాయంత్రాంగం సన్నద్ధమవుతోంది. ఈ సమావేశాలను జిల్లాలోని 17మండలాల్లోని 382 రెవెన్యూ గ్రామాల్లో జిల్లా కలెక్టర్ సారథ్యంలో అదనపు కలెక్టర్ల పర్యవేక్షణలో నిర్వహిస్తారు. ఆర్డీవోలు నోడల్ అధికారులుగా నియమించే అవకాశం ఉంది. భూభారతి ప్రధాన లక్ష్యం గ్రామస్థాయిలో భూములకు సంబంధించిన రికార్డులను పదిలం చేయడం. గత ప్రభుత్వం గ్రామస్థాయిలో రికార్డులను తొలగించింది. 2014కు ముందు గ్రామాల్లో రెవెన్యూ శాఖ ఏటా జమాబందీ నిర్వహించేది. రెవెన్యూ, వ్యవసాయ, నీటి పారుదల శాఖల సిబ్బంది ఏడాదికోసారి రికార్డులను పరిశీలించేవారు. వ్యవసాయ, వ్యవసాయేతర భూముల వివరాలు, చోటుచేసుకున్న మార్పులు, ప్రభుత్వ భూముల వివరాలు, కబ్జాలు, తదితర అంశాలను ఎప్పటికప్పుడు రికార్డుల్లో నమోదు చేసి రెవెన్యూ శాఖకు పంపేవారు. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. దీన్ని గుర్తించిన ప్రభుత్వం పూర్తిస్థాయిలో రెవెన్యూ రికార్డులను ప్రక్షాళన చేసేందుకు చర్యలు చేపట్టింది.

గ్రామాల్లో వచ్చిన ఫిర్యాదులను పరిశీలించేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నారు.

15నుంచి 30వరకు దరఖాస్తుల పరిశీలన

పైలెట్ మండలాల్లో ఈ నెల 15 నుంచి 30 వరకు భూసమస్యలపై వచ్చిన దరఖాస్తులపై పరిశీలన చేపట్టనున్నారు. జిల్లాలోని ఆత్మకూరు(ఎం)లో భూసమస్యలపై అన్ని గ్రామాల్లోనూ దరఖాస్తులు అందుతున్నాయి. ప్రధానంగా ధరణి కారణంగా భూముల రికార్డుల్లో విస్తీర్ణంతోపాటు పేర్లు, సర్వే నెంబర్లు మార్పులు, కోర్టు కేసులు వంటివి అందుతున్నాయి. రెవెన్యూ యంత్రాంగం ఈ నెల 15వరకు గ్రామాల్లో వచ్చిన దరఖాస్తులను పరిశీలించనున్నారు. ఈ నెల 15నుంచి 30వరకు జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్‌తోపాటు ఆర్డీవోలు, తహసీల్దార్, రెవెన్యూ సిబ్బంది దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి వారికి భూసమస్యకు సంబంధించిన వివరాలను వెల్లడించనున్నారు. ఈ మేరకు మండలంలో అన్ని గ్రామాలనుంచి వచ్చిన వాటిని ఆన్‌లైన్‌లో రికార్డు చేస్తున్నారు. భూభారతి చట్టంలో భూసమస్య పరిష్కారానికి మార్గం....

- మిగతా 7వ పేజీలో...

ఉపాధ్యాయులకు వేసవిలో శిక్షణ తరగతులను నిర్వహించేందుకు ఉమ్మడి జిల్లాలో విద్యాశాఖ అధికారులు ఏర్పాట్లు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా శిక్షణ తరగతుల్లో భాగంగా నల్లగొండ, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో ఈ నెల 13వ తేదీ నుంచి మూడు విడతలుగా ఈ శిక్షణ తరగతులను కొనసాగిస్తారు. మొదటి విడతగా 13వ తేదీ నుంచి 17వ తేదీ వరకు రెండో విడతలో 20 నుంచి 24వ తేదీ వరకు మూడో విడతలో ఈనెల 27వ తేదీ నుంచి 31వ తేదీ వరకు శిక్షణ తరగతులను నిర్వహించేందుకు నిర్ణయించారు.

- (ఆంధ్రజ్యోతి-నల్లగొండ, భువనగిరి టౌన్)



5 రోజులు అంశాలు
ఉపాధ్యాయులకు వృత్త్యంతర శిక్షణ

» రేపటి నుంచి శిక్షణ తరగతులు ప్రారంభం
» మూడు విడతలుగా కొనసాగనున్న కార్యక్రమం
» ఉమ్మడి జిల్లాలో హాజరు కానున్న 9,423మంది ఉపాధ్యాయులు

టీచర్లకు శిక్షణ తరగతులను విజయవంతం చేయడంకోసం సోమవారం శిక్షణ తరగతుల ఇంచార్జిలకు, జిల్లా రిసోర్స్ పర్సన్‌లకు సంసిద్ధత సమావేశాన్ని నిర్వహించనున్నారు. ఈ సమావేశంలో ఉపాధ్యాయ శిక్షణను సమర్థవంతంగా నిర్వహించడానికి తీసుకోవాల్సిన అన్ని చర్యలపై చర్చించనున్నారు. మండలస్థాయిలో ప్రైమరీ పాఠశాల ఉపాధ్యాయులకు ఈ నెల 20నుంచి శిక్షణ తరగతులు నిర్వహిస్తారు. ప్రతీ ఉపాధ్యాయుడు శిక్షణ తరగతులకు హాజరుకావాలని, ఏ ఒక్కరికి మినహాయింపు లేదని జిల్లా విద్యాశాఖ అధికారులు స్పష్టం చేశారు. ప్రతీ విడతలో ఐదు రోజుల చొప్పున నిర్వహించే శిక్షణా తరగతులు మూడు విడతలుగా ఈ నెలలో మూడు వారాలపాటు కొనసాగనున్నాయి. మూడు జిల్లాల కలెక్టర్ల ఆదేశాల మేరకు ఈ శిక్షణ తరగతులకు సంబంధించి విద్యాశాఖ అధికారులు కార్యాచరణ సిద్ధంచేసి అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేశారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సుమారు మొత్తం 9,423 మంది వివిధ కేటగిరీల ఉపాధ్యాయులకు..

- మిగతా 7వ పేజీలో...

'ప్రగతి' విద్యార్థుల ప్రతిభ



కె.ఉజ్వల (314), ఎం.శైనీ (1306), సింధు (1847), భవాని(3755)

నల్లగొండ టౌన్, మే 11 (ఆంధ్రజ్యోతి): ఎప్‌సెట్ 2025 ఫలితాల్లో పట్టణంలోని ప్రగతి జూనియర్ కళాశాల విద్యార్థులు రాష్ట్రస్థాయిలో ఉత్తమ ర్యాంకులు సాధించి ప్రతిభచాటారు. కళాశాలకు చెందిన కె.ఉజ్వల 314వ ర్యాంకు సాధించి ప్రథమస్థానంలో నిలిచింది. అదేవిధంగా ఎం.శైనీ 1306, అరిబా తబుసమ్ 1363, పి.సింధూ 1847, నబీయా మహీన్ 2812, బి.భవాని 3755, అమాతుల్ ముజీబ్ షెజాన్ 4294, ఎస్.చరణ్ 4768, కె.సమీరా 5075, కె.యశ్వంత్ 5728, సుహాన ఫిర్దోస్ 5960, ఎన్.సాయిమిత్రా 7055, టి.శ్రీలక్ష్మి 7100, వి.దీక్ష 7464, పి.హాసిని 7561, బి.శిరిష 8031, కె.బాలాజీ 8379, నిఖిల్ 8653, ఎస్.శ్రీకాంత్ 8785, కె. హాసిని 9304, ఎల్. నితిన్‌సాయి 9681, కె. శ్రేయ రెడ్డి 9888 ర్యాంకులతోపాటు మరో 70మంది విద్యార్థులు 15వేల లోపు ర్యాంకులు సాధించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను కళాశాల ఛైర్మన్ చందా కృష్ణమూర్తి, డైరెక్టర్లు ఎ.నరేంద్రబాబు, ఎస్.శశిధర్‌రావు, చందా శ్రీనివాస్, పైళ్ల రమేష్‌రెడ్డి అభినందించారు.

ఎప్‌సెట్ ఫలితాల్లో 'గౌతమి' ప్రభంజనం



ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న గౌతమి కళాశాల యాజమాన్యం

నల్లగొండ టౌన్, మే 11 (ఆంధ్రజ్యోతి): ఎప్‌సెట్ ఫలితాల్లో నల్లగొండ పట్టణంలోని గౌతమి విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో అత్యుత్తమ ఫలితాలు సాధించారు. కళాశాలకు చెందిన ఎండీ ఉజైర్ 165వ ర్యాంకు, యాస్మీన్ 435, భవ్యశ్రీ 737, ఆఫీయాసదాఫ్ 1133, వి.గాయత్రి 1361, బుష్రా 1588, సుసన్న 2090, షైలా ఆలీఖాన్ 2267, సాయినిఖిల 3228, శృతి 3522, హేమచందర్ 4541, మీనాక్షి 5166, రాజారెడ్డి 5183, హితశ్రీ 5391, ఆవుల శివాని 6246, అజయ్ 6355, అంజలి 6365, దీపిక 6448, సాత్విక్ రెడ్డి 6512, పోలగోని దీపిక 7064, దీక్షితారెడ్డి 7230, శ్రీనిధి 7522, క్రిష్ణ చైతన్య 7682, ఇర్ఫాన్ తబుసమ్ 9778, తితీక్ష 10,504, బొడ్డుపల్లి లలిత 10,684, నవ్య 10,789వ ర్యాంకు సాధించారు. అదేవిధంగా మరో 61మంది విద్యార్థులు 61వేలలోపు ర్యాంకులు సాధించారు. ఈ సందర్భంగా ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను గౌతమీ విద్యా సంస్థల డైరెక్టర్లు కాసాల వెంకట్‌రెడ్డి, చల్లా వెంకటరమణ, కొమ్మిడి రఘుపాల్ రెడ్డి, పుట్ట వెంకటరమణారెడ్డిలు అభినందించారు.

'జయ' కళాశాల విద్యార్థుల ప్రతిభ

సూర్యాపేట అర్బన్, మే 11 (ఆంధ్రజ్యోతి) : ఎప్‌సెట్ ఫలితాల్లో జయ కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చారని జయ కళాశాల కరస్పాండెంట్ జయ వేణుగోపాల్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని కళాశాలలో ఎప్‌సెట్‌లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను అభినందించి, మాట్లాడారు. రాష్ట్రస్థాయిలో 141వ ర్యాంకు, 266వ ర్యాంకు, 695 ర్యాంకు, 913 వ ర్యాంకు, 917వ ర్యాంకులతో పాటు 1000లోపు ఐదుగురు, 5వేలలోపు 11 మంది, 10 వేల లోపు 24 మంది, 25వేలలోపు 53 మంది విద్యార్థులు ర్యాంకులు సాధించారని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్లు బింగి జ్యోతి, జెల్లా పద్మ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న జయ కళాశాల యాజమాన్యం

యాదగిరీశుడి జయంత్యుత్సవాలు
పరిసమాప్తి

7

'జాస్రిత' విద్యార్థుల హవా



మారియా(526), తబుసుమ్(822)

నల్లగొండ టౌన్, మే 11 (ఆంధ్రజ్యోతి): ఎప్‌సెట్ ఫలితాల్లో జాస్రిత అకాడమీ విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. అగ్రికల్చర్, ఫార్మసీ ఫలితాల్లో మారియా 526వ ర్యాంకు, ఆర్షియా తబుసుమ్ 822, ఆఫీసా సదాఫ్ 1133, పహాద్ 1284, పరియా మేహానిషా 1603, మరి యం 2025, దీక్షిత 2301, షర్వాని 2538, ఇందూ 2851, హిబా అన్వర్ 3068, వర్షిత 3106, జూహా అం జుమ్ 3315, ఆఫీయా జబీన్ 3900, మారియా తర న్నుం 4001, హూర్నాజ్ 4312, అక్షర 4500 ర్యాంకు లు సాధించా రు. ఈ సందర్భంగా ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను జాస్రిత అకాడమీ యజమాన్యం అభినందించింది.

ఐఐహెచ్‌టీపై ఆశలు

» గతంలో పోచంపల్లిలో ఏర్పాటుకు ప్రతిపాదనలు
» వేరే జిల్లాలో ఏర్పాటు చేసేందుకు ప్రయత్నాలు
» కార్మికుల విజ్ఞప్తితో మంత్రి తుమ్మల స్పందన

7

విద్యా హక్కు చట్టాన్ని అమలు చేయాలి

మిర్యాలగూడ టౌన్, మే 11(ఆంధ్రజ్యోతి): విద్యా హక్కు చట్టం అమలు జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని బీసీ యువజన సంఘ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుమలగిరి అశోక్ కోరారు. బీసీ భవన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ ప్రైవేట్ విద్యాలయాలు నిబంధనలను విస్మరించి విద్యను వ్యాపారంగా మారుస్తున్నాయని ఆయన పేర్కొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

మిర్యాలగూడ టౌన్, మే 11(ఆంధ్రజ్యోతి): మిర్యాలగూడ పట్టణంలోని బకాల్‌వాడీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన 1998-99 సంవత్సరం పదో తరగతి విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. చాలా కాలం తర్వాత కలుసుకున్నవారు యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. కార్యక్రమంలో విశ్రాంత హెచ్‌ఎం ఇంద్రసేనారెడ్డి, ఉపాధ్యాయులు చాపల శ్రీనివాస్, నారాయణరెడ్డి, అంజిరెడ్డి ఉన్నారు.

దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ నాయకుడు డబ్బికార్ మల్లేష్

మిర్యాలగూడ, మే 11(ఆంధ్రజ్యోతి): కార్మిక, కర్షక ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 20న చేపట్టనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యుడు డబ్బికార్ మల్లేష్ పిలుపునిచ్చారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన కార్మిక, కర్షక, రైతు, వ్యవసాయ కూలీల, కార్మిక సంఘాల సమావేశంలో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం 29కార్మిక చట్టాలను రద్దు చేసి నూతనంగా నాలుగు లేబర్ కోడ్‌లను తెచ్చి కార్మికులకు తీరని అన్యాయం చేస్తోందన్నారు. కార్మికులు కనీసం సంఘాలు పెట్టుకునే పరిస్థితి లేకుండా ఈ లేబర్ కోడ్‌లు చేస్తున్నాయని అన్నారు. కార్మికుల శ్రమను దోపిడిచేసే కార్పొరేట్లకు అనుకూలంగా చట్టాలను తెచ్చారన్నారు. సమ్మెలో భాగంగా స్థానిక సుందరయ్య పార్కునుంచి రాజీవ్‌చౌక్ వరకు భారీ ప్రదర్శన నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వీరేపల్లి వెంకటేశ్వర్లు, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రవినాయక్, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి డాక్టర్ మల్లుగౌతంరెడ్డి, ప్రజా సంఘాల నాయకులు జగదీశ్‌చంద్ర, పాదూరి శశిధర్‌రెడ్డి, కేవీపీఎస్ జిల్లా నాయకులు రెమిడాల పరుశరాములు, గోవర్దనా, బక్క శ్రీనివాసాచారి, టప్రా జిల్లా నాయకులు వాడపల్లి రమేశ్, పిల్లుట్ల సైదులు, రామారావు, సైదులు, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

హాలియా, మే 11(ఆంధ్రజ్యోతి): హాలియా సబ్‌స్టేషన్ పరిధిలో సోమవారం విద్యుత్‌కు అంతరాయం ఏర్పడుతుందని హాలియా విద్యుత్ ఏఈ ధన్‌రాజ్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. హాలియా సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ లిఫ్ట్ ఫీడర్ లైన్ కింద ఉన్న చెట్ల కొమ్మలు తొగిస్తున్నందున అనుముల, ఈశ్వర్‌నగర్, పెద్దగూడెం స్టేజీలలో ఉదయం 7గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. అదే విధంగా పులిమామిడి 11కేవీ ఫీడర్ లైన్ పరిధిలోని పులిమామిడి, మార్లగడ్డగూడెం, బంటువారిగూడెం, హజారీగూడెం ఫీడర్ లైన్ పరిధిలోని హజారీగూడెం, అలీనగర్ గ్రామాలకు కూడా ఉదయం 8 గంటల నుంచి 11గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



వైద్య శిబిరంలో పాల్గొన్న ఎమ్మెల్యే బాలునాయక్

పెద్దఅడిశర్లపల్లి, మే 11(ఆంధ్రజ్యోతి): మెగా వైద్య శిబిరాలను గ్రామీణ ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ సతీష్‌రెడ్డి సహకారంతో మండలంలోని అంగడిపేటలో యశోద ఆసుపత్రి మలక్‌పేట ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా ఆరోగ్యానికి పెద్దపీట వేస్తుందన్నారు. కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా ప్రభుత్వ ఆసుపత్రులలో మెరుగైన వైద్యసేవలు అందుతున్నాయని తెలిపారు. స్వచ్ఛందసంస్థలు, దాతలు ముందుకు వచ్చి ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ప్రజలకు వైద్య సేవలు అందించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ఎల్లయ్య యాదవ్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ నెర్మటి సతీష్‌రెడ్డి, వంగాల ప్రతాప్‌రెడ్డి, బోద్యనాయక్, శ్రీనివాస్‌రెడ్డి, సత్యంరెడ్డి, పాండునాయక్, బాలకృష్ణ, శేఖర్‌రెడ్డి, మలక్‌పేట యశోద ఆసుపత్రి డాక్టర్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ కన్నిలాల్ ఆశయ సాధనకు కృషి చేయాలి



కన్నిలాల్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్

దేవరకొండ, మే 11(ఆంధ్రజ్యోతి): దేవరకొండ మండలం రత్యతండా మాజీ సర్పంచ్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రమావత్ రవీంద్రకుమార్ తండ్రి కన్నిలాల్ ఆశయ సాధనకు కృషి చేయాలని సూర్యాపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. మండలంలోని రత్యతండాలో కన్నిలాల్ విగ్రహాన్ని రవీంద్రకుమార్‌తో కలిసి ఆదివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. రత్యతండా ఏకగ్రీవ సర్పంచ్‌గా పలు అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. తండాకు రోడ్లు, మౌలిక సదుపాయాలు కల్పించడంలో కన్నిలాల్ పాత్ర కీలకమైందని గుర్తు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్‌రెడ్డి, గాదరి కిషోర్, తిప్పన విజయసింహరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రాజెక్టు పనులు నిర్వహించాలి: మాజీ మంత్రి జగదీష్ రెడ్డి

చింతపల్లి : డిండి, ఎత్తిపోతల ప్రాజెక్టు పనులు సత్వరమే పూర్తి చేయాలని మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్ రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం దేవరకొండకు వెళ్తూ మార్గమధ్యలో వెంకటేశ్వరనగర్(మాల్)లో కొద్దిసేపు ఆగారు. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హమీల అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. గత ప్రభుత్వ హయాంలో అన్నివర్గాల ప్రజల సంక్షేమానికి కృషి చేశామన్నారు. రాజకీయలబ్ధి కోసమే కాంగ్రెస్‌నాయకులు కాలయాపన చేస్తున్నారని ఆయన ఆరోపించారు. కార్యక్రమంలోబీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కంకణాల వెంకట్ రెడ్డి మాజీ జడ్పీటీసీ సభ్యులుఎడుదొడ్ల రవీందర్ రెడ్డి, పూల యాదయ్య, బాదేపల్లి నిరంజన్ గౌడ్, రామకృష్ణ,తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలి

చింతపల్లి, మే 11(ఆంధ్రజ్యోతి): టీడీపీతో బలోపేతానికి కార్యకర్తలందరూ కృషి చేయాలని నియోజకవర్గ ఇన్‌చార్జి వస్కుల కృష్ణయ్య అన్నారు. మండలంలోని వెంకటేశ్వరనగర్(మాల్)లో ఆదివారం పార్టీ నాయకులకు డిజిటల్ సభ్యత్వ నమోదు కార్డులను ఆయన అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ పోటీ చేస్తుందన్నారు. గ్రామాల్లో టీడీపీ మరింత బలోపేతానికి కార్యకర్తలు పని చేయాల్సిన అవసరం ఉందన్నారు. టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు, మంత్రి లోకేష్ నేతృత్వంలో తెలంగాణలో పార్టీ అత్యధిక సభ్యత్వాలు చేయించారన్నారు. కార్యక్రమంలో మండల నాయకులు డాక్టర్ విజయ్‌కుమార్, దోటి సంతోష్, మాజీ సర్పంచి సిద్ధగోని నరసింహ, ఎదుల సాలయ్య పాల్గొన్నారు.

కూడలిలో.. కనువిందు

▸▸ వై జంక్షన్‌లో ఆహ్లాదం ▸▸ అమరుల స్మారక విగ్రహ తోరణం



ఆంజనేయస్వామి భారీ విగ్రహం

(మిర్యాలగూడ టౌన్ - ఆంధ్రజ్యోతి)

మిర్యాలగూడ పట్టణ ముఖద్వారం కూడలిని అందంగా తీర్చిదిద్దారు. అద్దంకి-నార్కెట్‌పల్లి బైపాస్ నుంచి పట్టణంలోనికి వచ్చే కూడలిని వై జంక్షన్‌గా నామకరణం చేయడంతోపాటు ఆ ప్రాంతాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. అక్కడే ఆంజనేయస్వామి భారీ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నారు. పట్టణంలోకి అడిగిడే కూడలిని సుందరమయంగా తీర్చిదిద్దారు. మునిసిపల్ మాజీ చైర్మన్ తిరునగరు భార్గవ్ ప్రత్యేక దృష్టితో వై జంక్షన్‌ను అనేలా తీర్చిదిద్దారు. పచ్చని పార్కు, ఆహ్లాదపరిచేలా సీతాకోకచిలక రూపాలతో కూడిన వృక్షం, వెల్కమ్ టూ మిర్యాలగూడ అంటూ పెద్ద అక్షరాలతో మినీ పార్కుపై రాయించారు.



స్వాతంత్ర్య సమరయోధుల విగ్రహాలు

అమరుల స్మారక విగ్రహ తోరణం

పట్టణంలోని వై జంక్షన్ అమరుల విగ్రహాలతో ఆహ్వానం పలుకుతోంది. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, సంఘ సంస్కర్త బాబు జగ్జీవన్‌రామ్, సామాజిక సంస్కర్త, రాజకీయవేత్త, బీఎస్పీ వ్యవస్థాపకులు కాన్షీరాం, మాజీ ఎంపీలు గడ్డం వెంకటస్వామి, బీఎన్‌రెడ్డి విగ్రహాలను కూడా ఏర్పాటు చేశారు.



మిర్యాలగూడ పట్టణ ముఖ ద్వారం వద్ద ఏర్పాటు చేసిన వెల్‌కమ్ టూ మిర్యాలగూడ



పట్టణ ముఖ ద్వారం వద్ద ఏర్పాటు చేసిన గరుడ పక్షి బొమ్మలు

ఎప్‌సెట్ ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ



పావని, అస్విత, నిత్య, జుహా అంజూమ్

మిర్యాలగూడ టౌన్, మే 11(ఆంధ్రజ్యోతి): ఎప్‌సెట్ ఫలితాల్లో పట్టణంలోని కేఎల్‌ఎన్ జూనియర్ కళాశాల విద్యార్థులు సత్తా చాటారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ బికుమళ్ల కిరణ్ కుమార్ మాట్లాడుతూ ఇంజనీరింగ్ విభాగంలో సంద్రాల పావని 5068వ ర్యాంకు సాధించగా, ఎస్. అస్విత 10389వ ర్యాంకు సాధించడం ఆదర్శనీయమన్నారు. పి. నిత్య 12618వ ర్యాంకు, ఎం హాసిత 18397వ ర్యాంకుతో నిలిచారన్నారు. అగ్రికల్చర్ విభాగం లో తమ విద్యార్థిని జుహా అంజూమ్ 3315వ ర్యాంకు సాధించగా, షేస్త అంజూమ్ 11748వ ర్యాంకుతో జయభేరి మోగించారన్నారు. ఇరు విభాగాల్లో పది మంది విద్యార్థులు పాతిక వేల లోపు ర్యాంకులు సాధించగా, మరో పది మంది 30వేల లోపు ర్యాంకులతో కార్పొరేట్ కళాశాలలకు ధీటుగా నిలిచారన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్లు పీఎల్‌ఎన్ రెడ్డి, హన్మంతరెడ్డి, నరేందర్‌రెడ్డి, చైతన్య ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు



యాగశాల ప్రవేశం నిర్వహిస్తున్న అర్చకులు

హాలియా,మే 11(ఆంధ్రజ్యోతి): హాలియా మున్సిపాలిటీలోని స్వయంభూ శ్రీ వేంకటేశ్వరస్వామి 12వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభయ్యాయి. ఈ సందర్భంగా ఉదయం భగవాదారాధన, సేవాకాలం, తీర్థప్రసాద గోష్టి, యాగశాల ప్రవేశం, అగ్ని ప్రతిష్ట, నృసింహ మూల మంత్ర హోమం, సాయంత్రం శ్రీ విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణం అనంతరం మూల మంత్ర హోమం, తీర్థప్రసాద గోష్టి తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సోమవారం ఉదయం భగవదారధణ, సేవాకాలం, తీర్థప్రసాద గోష్టి, ఉదయం 10 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి తిరు కళ్యాణోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నట్లు కల్యాణ అనంతరం మహా అన్నప్రసాద వితరణ కార్యక్రమం, సాయంత్రం పురవీధుల్లో స్వామివారి శోభయాత్ర, 13వ తేదీ మంగళవారం భగవారాధన, తీర్థప్రసాద గోష్టి, మహా పూర్ణాహుతి, చక్రస్నానం, మహాకుంభ ప్రోక్షణ, తీర్థప్రసాద వితరణ తదితర పూజా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. స్వామివారి కల్యాణ మహోత్సవానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని నిర్వాహకులు కోరారు.

దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి

పెద్దవూర, మే 11(ఆంధ్రజ్యోతి): కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఈనెల 20న నిర్వహినంచనున్న దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కేవీపీఎస్ జిల్లా నాయకుడు దొంతాల నాగార్జున అన్నారు. మండల కేంద్రంలోఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తూ నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకొచ్చిందన్నారు. 8గంటల పని దినాన్ని 12గంటలకు పెంచేందుకు కుట్రలు చేస్తుందన్నారు. బీసీ జనగణన వెంటనే చేపట్టాలని, పెరుగుతున్న ధరలను అరికట్టాలన్నారు. దేశ వ్యాప్త సమ్మెలో కార్మికులు, రైతులు, ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు, విద్యార్థి సంఘాలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మల్లయ్య, నాగయ్య, ఎల్లయ్య పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న దొంతాల నాగార్జున

తల్లిదండ్రులను గౌరవించాలి : ఎమ్మెల్సీ శంకర్‌నాయక్



దామరచర్ల : కేతావత్‌తండాలో తల్లి షాహా విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ శంకర్‌నాయక్

దామరచర్ల, మే 12(ఆంధ్రజ్యోతి): సృష్టిలో తల్లి ప్రేమను మించింది ఏమి లేదని, ప్రతి ఒక్కరూ తల్లిదండ్రులను గౌరవించాలని ఎమ్మెల్సీ కెతావత్ శంకర్‌నాయక్ అన్నారు. ఆదివారం మదర్స్ డే సందర్భంగా మండలంలోని దిలావర్‌పూర్ గ్రామ పరిధిలోని కెతావత్‌తండాలో తన తల్లి కెతావత్ షాహా విగ్రహానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. తల్లిదండ్రులు దైవంతో సమానమని, ముఖ్యంగా అమ్మ లేకపోతే జననం లేదని, గమనం లేదన్నారు. ఈ లోకంలో ప్రతి ఒక్కరికి తొలి గురువు తల్లేనని అన్నారు.

దేవరకొండ వృద్ధా ఆశ్రమ కేంద్రంలో

దేవరకొండ : దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలోదేవరకొండ వయోవృద్ధుల ఆశ్రమ కేంద్రంలో ఆదివారం అంతర్జాతీయ మాతృ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆశ్రమ కేంద్ర నిర్వాహకురాలు సంధ్యారెడ్డితోపాటు వృద్ధులను సన్మానించారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్‌వీటీ మాట్లాడుతూ స్పోర్ట్స్ అసోసియేషన్ వయోవృద్ధులకు అండగా ఉండి సహాయ, సహకారాలు అందిస్తుందన్నారు. వృద్ధాశ్రమంలో అమ్మలను వదిలేసిన కొడుకులు, బిడ్డలు అనాధలన్నారు. కార్యక్రమంలో కొండ్ర శ్రీశైలం యాదవ్, తాళ్ల శ్రీధర్‌గౌడ్, కృష్ణకిషోర్, నిరంజన్, క్రాంతి, వెంకటేష్, స్పోర్ట్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ప్రార్ధన మందిరంలో

మిర్యాలగూడ టౌన్ : పట్టణంలోని విశ్వాస పరిచర్య ప్రార్ధన మందిరంలో మాతృదినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చర్చి ఫాదర్ ధీరావత్ హన్యానాయక్ మాట్లాడుతూ తల్లికి మించిన దైవం లేదన్నారు. ప్రతి బిడ్డ తనకు జన్మనిచ్చిన తల్లిదండ్రులకు రుణపడి ఉండాలన్నారు. అనంతరం కేక్ కోసి మహిళలకు స్వీట్లు పంపిణీ చేసి ప్రత్యేక ప్రార్ధనలు జరపారు. ఈ కార్యక్రమంలో రమాభాయి, సుధారాణి, రూతమ్మ, కోటమ్మ, మారెమ్మ, లీల, మంగమ్మ, సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.



మిర్యాలగూడలోని విశ్వాస పరిచర్య ప్రార్థన మందిరంలో..



దేవరకొండ: వృద్ధులకు పండ్లు పంపిణీలో పాల్గొన్న స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్‌వీటీ, సభ్యులు

నిరుపయోగంగా దొండ మార్కెట్

▸▸ దళారీల చేతిలో మోసపోతున్న రైతులు
▸▸ మార్కెట్‌లో సదుపాయాలు కల్పించాలని వేడుకలు

వరికి భిన్నంగా వాణిజ్యపంటల సాగుపై దృష్టి సారిస్తున్నారు దేవరకొండ డివిజన్ పరిధిలోని రైతులు. గతేడాది డివిజన్ పరిధిలోని 2.12 లక్షల ఎకరాల్లో వేరుశనగ, దొండ, మిరప, మునగ, ఆకుకూరలు, టమా ట, ఇతర వాణిజ్య పంటలు సాగు చేస్తున్నప్పటికీ గిట్టుబాటు ధర లేకపోవడంతో ఆందోళన వ్యక్తమవుతోంది.

(ఆంధ్రజ్యోతి- దేవరకొండ)



పీఏపల్లి మండలం కొనమేకలవారిగూడెంలో నిరుపయోగంగా ఉన్న దొండ మార్కెట్

కొన్నేళ్లుగా ఏఎమ్మార్పీ ఆయకట్టు కింద పూర్తి స్థాయిలో సాగునీరు విడుదల చేయకపోవడంతో రైతులు ఆరుతడి పంటలైన దొండ, మునగ, ఇతర కూరగాయల సాగుపై దృష్టి సారించారు. పీఏపల్లి, గుర్రంపోడు మండలాలలోని 15వేల ఎకరాలకుపైగా దొండ, మునగ పంటలను రైతులు సాగు చేశారు. పీఏపల్లి మండలం అక్కంపల్లి, రంగారెడ్డిగూడెం, కోనమేకలవారిగూడెం, అంగడిపేట, మల్లాపురం గ్రామాల్లో 9 నుంచి 10వేల ఎకరా లకు పైగా రైతులు దొండ సాగు చేశారు. కానీ దొండకు మార్కెట్ సౌకర్యం లేకపోవడంతో దళారీలు చెప్పిన రేటుకే విక్రయించే పరిస్థితి. పీఏపల్లి మండలం కోనమేకలవారిగూడెం వద్ద అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం 2016 లో దొండ మార్కెట్‌ను రూ.60 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసింది. ఆ మార్కెట్‌లో సౌకర్యం కల్పించక పోవడం, అధికారుల నిర్లక్ష్యం కారణంగా దొండ మార్కెట్ నిరుపయోగంగా మారింది. దీన్ని ఆసరాగా చేసుకొని వ్యాపారు లు నేరుగా రైతుల వద్దకే వచ్చి దొండ పంటను తాము చెప్పిన రేటుకే కొనుగోలు చేసి తీసుకెళ్తున్నారు. ఎకరాకు రూ.2.5 లక్షల ఖర్చుతో దొండ పంటను రైతులు సాగు చేస్తున్నారు. ఉద్యానవన శాఖ 60శాతం సబ్సిడీ ఇస్తుందని రైతులు తెలుపుతున్నారు. 60 రోజుల నుంచి దొండ పంట దిగుబడి అవుతుంది. ప్రస్తుతం దొండ కా య 50 కిలోల బస్తాకు మార్కెట్‌లో రూ.400 నుంచి 600 వరకు ధర పలుకుతోంది. హైదరాబాద్, గుంటూరు, వరంగల్, మాచర్ల, బోయినపల్లి నుంచి వ్యాపారులు వాహనాల్లో దొండ తోటల వద్దకు వచ్చి వారు నిర్ణయించిన ధరకే రైతుల నుంచి దొండ కాయలు కొనుగోలు చేస్తున్నారు. విధిలేని పరిస్థితిలో వ్యాపారులు చెప్పిన రేటుకే దొండ పంటలను విక్రయించాల్సి వస్తుందని రైతులు వాపోతున్నారు. మార్కెట్ ఉన్న నిరుపయోగంగా ఉందని, అధి కారులకు తెలిపిన పట్టించుకోవడంలేదని రైతులు తెలుపుతున్నారు.

ఏఏ పంటలు ఎంత సాగు అంటే..

గతేడాది 1.70 లక్షల ఎకరాల్లో పత్తి సాగుచేయగా 15 వేల ఎకరాల్లో వేరుశనగ, 25 వేల ఎకరాల్లో వరి, ఇతర పంటలను సాగు చేశారు. ఈ ఏడాది డివిజన్ పరిధిలో 2వేల ఎకరాల వరకు మిరప సాగు చేశారు. 15 వేల ఎకరాల వరకు వేరుశనగ సాగు చేశారు. రైతులు అధికంగా దొండ, వేరుశనగ, మిరప, మునగ, ఇతర పంటలపై దృష్టి సారిస్తున్నారు. వ్యవసాయశాఖ అధికారుల సల హాలు, సూచనలు తీసుకొని బోరు బావులు, నీటివనరులు ఉన్న రైతులు అధికంగా కూరగాయలు సాగు చేస్తున్నారు.

గిట్టుబాటు ధర కల్పించాలి



దొండ రైతులకు మార్కెట్ సౌకర్యం ఏర్పాటు చేసి ప్రభుత్వమే కొనుగోలు చేయాలి. మూడు ఎకరాల్లో రూ. 3 లక్షలకుపైగా పెట్టుబడులు పెట్టి దొండ సాగు చేశా. అధికారుల పర్యవేక్షణ లేకపోవడం, వ్యాపారులు చెప్పిన రేటుకే విక్రయించే పరిస్థితి. గిట్టుబాటు ధర కల్పించాలి.

- వంగాల గోవర్ధన్‌రెడ్డి, అంగడిపేట

దొండ మార్కెట్ ఏర్పాటు చేయాలి



పీఏపల్లిలో రూ.60లక్షలతో దొండ మార్కెట్ నిర్మించినప్పటికీ పర్యవేక్షణ లేక నిరుపయోగంగా ఉంది. దొండ రైతులు వ్యాపారులు చెప్పిన రేటుకే విక్రయిస్తూ నష్టపోతున్నారు.

దేప సుదర్శన్‌రెడ్డి, వ్యవసాయ కార్మికసంఘం నాయకుడు, దేవరకొండ

సమస్య పరిష్కారానికి కృషి

పీఏపల్లిలో దొండ మార్కెట్‌ను వినియోగంలోకి తెచ్చేందుకు కృషి చేస్తున్నా. ఈ విషయమై జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించేలా కృషి చేస్తా.

-రమణారెడ్డి, ఆర్డీవో,దేవరకొండ